# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 339, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శుక్రవారం - 21 - ఫిబ్రవరి - 2025


### భారత్‌లో మరెవర్నో గెలిపించేందుకే ఆ నిధులు..
## గత బైడెన్ ప్రభుత్వంపై ట్రంప్ ఆరోపణలు



నేషనల్ డెస్క్: భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచడానికి అమెరికా ప్రభుత్వం అందజేసే 21 మిలియన్ డాలర్లను ఇక నుంచి నిలిపివేస్తున్నట్టు ట్రంప్ యంత్రాంగంలో కీలక పాత్ర పోషిస్తున్న మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నిధులు నిలిపివేతపై అమెరికా అధ్యక్షుడు

### కేంద్ర జల్‌శక్తి మంత్రితో
## సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భేటీ!



న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బిజీబిజీగా గడుపుతున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు, పవన్ భేటీ అయ్యారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన 12 వేల కోట్లు నిధుల విడుదలపై కేంద్ర మంత్రి

## ముంబై, కోల్‌కతాపై దూసుకొస్తున్న ఆస్టరాయిడ్!



- భూమి వైపు దూసుకొస్తున్న గ్రహశకలం
- 'సిటీ కిల్లర్'గా గుర్తించిన ఖగోళ శాస్త్రవేత్తలు
- రిస్క్ కారిడార్‌లో 7 ప్రధాన నగరాలు
- ఢీకొనే అవకాశాలు 3.1% పెరుగుదల
- గ్రహశకలం దిశను గమనిస్తున్న నాసా

న్యూయార్క్: అంతరిక్షంలో గతితప్పి దూసుకొస్తున్న '2024 వైఆర్4' అనే గ్రహశకలం భూమిని ఢీకొనే అవకాశాలు మరింతగా పెరిగాయి. ఆ ఆస్టరాయిడ్ గమనం ప్రకారం.. భూమిని ఢీకొట్టే అవకాశం 3.1 శాతం పెరిగింది. ఈ ఆస్టరాయిడ్ ఢీకొనే అవకాశమున్న రిస్క్ కారిడార్‌లో తూర్పు పసిఫిక్

## ఆరోజు జగన్‌తో కేసీఆర్ స్నేహంగా మెలిగారు!



- జగన్‌తో స్నేహంగా ఉంటూ జలదోపిడీకి సహకరించారని ఆరోపణ
- కృష్ణా జలాల్లో తెలంగాణకు 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పారని ఆగ్రహం
- జగన్ హయాంలో పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచినా కేసీఆర్ మౌనంగా ఉన్నారని విమర్శ

# ప్రకృతి సేద్యానికి
# అమెరికా సంస్థల సహకారం..

- త్వరలో రైతు సాధికార సంస్థతో కీలక ఒప్పందం!
- ఏపీకి వచ్చిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థల ప్రతినిధులు
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో సచివాలయంలో సమావేశం
- సాగు, ఉత్పత్తి, సాంకేతికత, మార్కెటింగ్ వంటి అంశాల్లో సాయం





అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల దావోస్ పర్యటనలో పలు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను వివరించి ప్రకృతి వ్యవసాయంలో ఏపీతో కలిసి పనిచేసేందుకు రావాలని ఆహ్వానించారు. ఈ క్రమంలో నాడు చంద్రబాబుతో భేటీ అయిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థల ప్రతినిధులు బుధవారం ఏపీకి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యారు.

### ఇష్టానుసారం చేస్తానంటే కుదరదు
## జగన్ కు చంద్రబాబు కౌంటర్



- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు జగన్ గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లడంపై చంద్రబాబు మండిపాటు
- అక్రమాలు చేసేందుకు పోలీసుల రక్షణ ఇవ్వాలంటే ఎలాగని ప్రశ్న
- రౌడీయిజం చేయడం సరికాదని హితవు

## హైడ్రా విధుల్లో డీఆర్ఎఫ్ పాత్ర చాలా కీలకం



- ఔట్ సోర్సింగ్ విధానంలో 357 మందిని తీసుకున్న హైడ్రా
- అంబర్‌పేట పోలీసు శిక్షణ మైదానంలో వారం రోజుల పాటు శిక్షణ
- ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు స్పందించాలన్న రంగనాథ్

హైదరాబాద్, : హైదరాబాద్ నగరంలో హైడ్రా నిర్వహిస్తున్న విధుల్లో డీఆర్ఎఫ్ బృందాల పాత్ర

## ఢిల్లీ సీఎం రేఖాగుప్తా ప్రమాణ స్వీకారంలో అనుకోని అతిథి!



ఢిల్లీ : కొత్త సీఎం రేఖాగుప్తా ప్రమాణ స్వీకారంలో అనుకోని అతిథి ప్రత్యక్షమయ్యారు. ఎవరా? ఆ అనుకోని అతిథి అనుకుంటున్నారా? అదేనండి ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతి మాలివాల్. ఆప్ అధికారంలో ఉండగా.. ఆ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై విమర్శలు చేసి రెబల్ మహిళా నేతగా మారిన స్వాతి మాలివాల్. గురువారం బీజేపీ సీఎం రేఖ గుప్తా ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టేజీ మీద కాంగ్రెస్ ఢిల్లీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్‌తో ముచ్చటిస్తూ తారసపడ్డారు. ప్రస్తుతం ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి, తర్వాత జరుగుతున్న వరుస రాజకీయ పరిణామాలతో ఆప్ ఇమేజ్ డ్యామేజీ అయ్యేందుకు పరోక్షంగా స్వాతి మాల్ కారణమవుతున్నారు. గతేడాది మేలో ఆప్‌లో అంతర్గతంగా కొనసాగుతున్న

# ఏపీలో 25 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులే లక్ష్యంగా అడుగులు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, రానున్న ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. బుధవారం ద్వారకా ఢిల్లీలోని యశోభూమిలో జరిగిన సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ -2025 (ఎస్ఏటీటీఈ)లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా

- పర్యాటక రంగంలో పెట్టుబడులకు మంత్రి కందుల దుర్గేశ్ ఆహ్వానం
- ఢిల్లీలో సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ -2025లో పాల్గొన్న మంత్రి
- పీపీపీ విధానంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి

## చంద్రబాబు, పవన్ లతో ప్రత్యేకంగా సమావేశమైన మోదీ

- ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశం
- సమావేశానికి హాజరైన మోదీ, అమిత్ షా
- ఏపీకి కేంద్రం అన్ని విధాలా అండగా ఉంటుందన్న మోదీ



**అమరావతి,:** ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణస్వీకార కార్యక్రమం ముగిసిన తర్వాత ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లతో మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏపీలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయని మోదీ అడిగారు. అమరావతి పనుల స్థితిగతులను కూడా అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మోదీ భరోసా ఇచ్చారు. దీనికి చంద్రబాబు, పవన్ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్డీయే సమావేశం పూర్తైన తర్వాత జాతీయ మీడియాతో పవన్ మాట్లాడుతూ... ఆరోగ్యం బాగోలేకపోవడం వల్లే గత ఎన్డీయే సమావేశాలకు తాను హాజరుకాలేకపోయానని చెప్పారు. ఇప్పటికీ తాను వెన్నునొప్పితో బాధపడుతున్నానని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని... అన్ని హామీలను నెరవేరుస్తామని చెప్పారు.

### తిరుమల శ్రీవారి ఆలయంపై
## విమానం చక్కర్లు..



## భక్తుల ఆగ్రహం

తిరుమల: తిరుమల ఆలయం వద్ద మరోసారి అపచారం జరిగింది. శ్రీవారి ఆలయంపై మళ్లీ విమానం ఎగిరింది. ఆగమశాస్త్రం ప్రకారం ఆలయంపై విమానం ఎగరడం అపచారంగా భావిస్తారు. ఇటీవల తిరుమల ఆలయంపై వరుసగా విమానాలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక, ఇటీవల హోంమంత్రి వంగలపూడి అనిత తిరుమలను నో ఫ్లై జోన్‌గా ప్రకటించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఇంతలోనే తాజాగా విమానం చక్కర్లు కొట్టడం

## పాలవలస కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ..



మన్యం,: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చేరుకున్నారు. పాలవలస కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. జగన్ రాక నేపథ్యంలో వైఎస్సార్‌సీ‌శ్రేణులు, అభిమానులు భారీగా అక్కడికి చేరుకున్నారు. నియోజకవర్గంలో సీనియర్ నేత అయిన పాలవలస రాజశేఖరం(81) ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని జగన్ పరామర్శించనున్నారు. అంతకు ముందు రాజశేఖరం మృతిపై సంతాపం వ్యక్తం చేసిన వైఎస్ జగన్.. ఫోన్ ద్వారా ఆ కుటుంబంతో

## భారత్‌లో మరెవర్నో గెలిపించేందుకే ఆ నిధులు..
# గత బైడెన్ ప్రభుత్వంపై ట్రంప్ ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

ఈ అంశం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నిధులు నిలిపివేతపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరోసారి స్పందించారు. ఈ మేరకు గత బైడెన్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఉద్దేశించిన 21 మిలియన్ డాలర్ల నిధులతో అక్కడున్న 'మరెవరి' గెలుపు కోసమో బైడెన్ పనిచేశారని ఆయన ఆరోపించారు. బుధవారం రాత్రి మియామిలో నిర్వహించిన ఎఫ్ఐఐ ప్రియారిటీ సదస్సులో ట్రంప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిధుల అంశాన్ని ప్రస్తావించారు. భారత్‌లో ఓటింగ్ శాతం కోసం మనమెందుకు 21 మిలియన్ డాలర్లను ఖర్చు చేయాలి? అని ప్రశ్నించారు. ఆ దేశం (భారత్‌ను ఉద్దేశించి)లో మరెవర్నో గెలిపించేందుకు వారు (బైడెన్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ప్రయత్నించినట్లు అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని భారత ప్రభుత్వానికి తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. అదే కీలక ముందడుగు అవుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

భారత్ వద్ద చాలా డబ్బు ఉంది..

కాగా, నిధుల నిలిపివేత అంశంపై అంతకుముందు ఫ్లోరిడాలోని తన నివాసమైన మార్ ఎ లాగోలో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. భారత్ వద్ద చాలా డబ్బులు ఉన్నాయని.. అలాంటప్పుడు ఇండియాకు 21 మిలియన్ డాలర్ల సాయం ఎందుకు చేయాలంటూ ప్రశ్నించారు. తనకు భారత ప్రజలు, ప్రధాని పట్ల ఎంతో గౌరవం ఉందని చెప్పారు. 'భారత్‌కు 21 మిలియన్ డాలర్లు ఎందుకు ఇవ్వాలి..? వారివద్ద చాలా డబ్బు ఉంది. ప్రపంచంలోనే అత్యధికంగా పన్ను విధించే దేశాల్లో భారత్ ఒకటి. వారు విధించే సుంకాలు కూడా చాలా ఎక్కువ. సుంకాల విషయంలో అమెరికా ఎన్నడూ భారత్‌ను చేరుకోలేదు. కానీ, వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు మాత్రం మనం 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా..? మరి మన దేశంలో ఓటర్ల పరిస్థితి ఏంటి..?' అంటూ ట్రంప్ ప్రశ్నించారు.

## కేంద్ర జల్‌శక్తి మంత్రితో
# సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భేటీ!

మొదటి పేజీ తరువాయి

ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన 12 వేల కోట్లు నిధుల విడుదలపై కేంద్ర మంత్రి పాటిల్ తో ఇరు నేతలు చర్చించనున్నారు. అలాగే పోలవరం కుడి, ఎడమ కాలువలను 17,500 క్యూసెక్కుల నీటి తరలింపు సామర్థ్యంతో నిర్మించేందుకు అవసరమైన ఆర్థిక సహాయంపైనా వారు కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా ఉన్నారు. జల్‌శక్తి మంత్రితో భేటీ అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీ రామ్ లీలా మైదానానికి వెళతారు. ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి ఇద్దరు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్డీయే కీలక నేతలు హాజరయ్యారు. రేఖా గుప్తా ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. ఏపీకి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర హోంమంత్రితో చర్చిస్తారు. అనంతరం సాయంత్రం 4:45కి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తోనూ బాబు వారు సమావేశం కానున్నారు.

# ఆరోజు జగన్‌తో కేసీఆర్ స్నేహంగా మెలిగారు!

**హైదరాబాద్, :** కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌తో స్నేహంగా ఉంటూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన జల దోపిడీకి సహకరించారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆనాడు ఏపీ ప్రభుత్వం చేసిన జల దోపిడీకి కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత బీఆర్ఎస్‌దేనని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కృష్ణా జలాల్లో 500 టీఎంసీల కోసం పోరాడుతున్నామని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణకు చాలా అన్యాయం జరిగిందని ఆయన అన్నారు. జగన్ హయాంలో పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచినా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మిస్తున్నా కేసీఆర్ మౌనంగా ఉన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు రాలేదు కానీ, బీఆర్ఎస్ నేతల జేబులు మాత్రం నిండాయని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే, మేడిగడ్డ కూలిపోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు పదేళ్లు అధికారంలో ఉండి కనీసం టెలిమెట్రీలు కూడా ఏర్పాటు చేయలేదని ఆయన విమర్శించారు.

## రాజకీయాల్లో కేసీఆర్ శకం ముగిసింది..
# అలా మాత్రమే ఆయనను గౌరవిస్తాం

మొదటి పేజీ తరువాయి

**హైదరాబాద్, :** తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ శకం ముగిసిందని, ఉద్యమ నేతగా మాత్రమే ఆయనను గౌరవిస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్ చెప్పినంత మాత్రాన తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని, తమ గ్రాఫ్ ఎలా పడిపోతుందని నిలదీశారు. ఫామ్ హౌస్‌లో కూర్చొని పెన్ను, పేపర్‌తో గీస్తే గ్రాఫ్ పడిపోతుందా అని ఆయన అన్నారు. రాష్ట్రంలో 56 శాతం బీసీలు తమ వెంటే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఏడాది పాలనలోనే 56 వేల ఉద్యోగాలు ఇచ్చామని, రైతులకు రుణమాఫీతో సహా పలు కీలక హామీలను నెరవేరుస్తుంటే గ్రాఫ్ ఎలా పడిపోతుందో చెప్పాలన్నారు. కేసీఆర్ గ్రాఫ్ మొత్తం నేలమట్టమై ఫామ్ హౌస్‌కు పరిమితమైందని విమర్శించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని వ్యాఖ్యానించారు. తండ్రీకొడుకులు మాత్రమే పార్టీలో ఉంటారని ఆయన అన్నారు. కేసీఆర్‌కు పగటి కలలు కనడం అలవాటుగా మారిందని విమర్శించారు. ఆయన శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటే మంచిదని హితవు పలికారు. పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టే బలం లేని బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు.

# హైడ్రా విధుల్లో డీఆర్ఎఫ్ పాత్ర చాలా కీలకం

**హైదరాబాద్, :** హైదరాబాద్ నగరంలో హైడ్రా నిర్వహిస్తున్న విధుల్లో డీఆర్ఎఫ్ బృందాల పాత్ర కీలకమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. డీఆర్ఎఫ్‌లోకి అవుట్ సోర్సింగ్ విధానంలో కొత్తగా నియమితులైన 357 మంది సిబ్బంది శిక్షణ ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాలు, ప్రజల అంచనాలకు అనుగుణంగా హైడ్రా పనిచేస్తోందని ఆయన తెలిపారు. డీఆర్ఎఫ్‌లోకి అవుట్ సోర్సింగ్ విధానంలో నియమితులైన సిబ్బందికి హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీసు శిక్షణ మైదానంలో వారం రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో డీఆర్ఎఫ్ పాత్ర ఎంతో ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం హైడ్రా విధులు కూడా అదనంగా చేరాయని తెలిపారు. హైడ్రాపై ఉన్న నమ్మకంతో ప్రభుత్వ పలు బాధ్యతలు అప్పగిస్తోందని, వాటిని సక్రమంగా నెరవేర్చాలని ఆయన సూచించారు. ఇటీవల ఇసుక అక్రమ రవాణాను నియంత్రించే బాధ్యతను కూడా హైడ్రాకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ బాధ్యతలను సిబ్బంది ఎంతో శ్రద్ధగా, బాధ్యతతో నిర్వర్తించాలని ఆయన అన్నారు. పోలీసు పరీక్షలో కొద్ది మార్కుల తేడాతో ఉద్యోగం పొందలేని వారిని అవుట్ సోర్సింగ్ విధానంలో తీసుకున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# తిరుమల శ్రీవారి ఆలయంపై విమానం చక్కర్లు..

మొదటి పేజీ తరువాయి

ఇక, ఇటీవల హోంమంత్రి వంగలపూడి అనిత తిరుమలను నో ఫ్లై జోన్‌గా ప్రకటించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఇంతలోనే తాజాగా విమానం చక్కర్లు కొట్టడం గమనార్హం. తిరుమలలో గురువారం ఉదయం ఓ విమానం తిరుమల శ్రీవారి ఆలయానికి దగ్గరగా వెళ్లింది. భక్తులు విమానం వెళ్లే సమయంలో విమానం చక్కర్లు కొట్టడంతో వారంతా ఫొటోలు, వీడియోలు తీశారు. అనంతరం, ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆగమశాస్త్రం ప్రకారం తిరుమలపై ఎటువంటి విమానాలు వెళ్లకూడదని చెబుతారు. దీనిపై టీటీడీ గతంలోనూ కేంద్ర పౌరవిమానయాన శాఖ దృష్టికి తీసుకెళ్లింది.. తిరుమలను నో ఫ్లై జోన్‌గా ప్రకటించాలని కోరింది. కానీ, కేంద్రం మాత్రం వీటిని పట్టించుకోవడం లేదు. అయితే ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి ఆలయం మీదుగా విమానాలు వెళ్లకూడదని.. అపచారం అంటున్నారు. గతంలో తిరుమల శ్రీవారి ఆలయానికి అతి సమీపంలో హెలికాప్టర్లు కూడా చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. ఇలా విమానం, హెలికాప్టర్లు వెళ్లిన ప్రతీసారి విజిలెన్స్ సిబ్బంది అలర్ట్ అవుతోంది. వివరాలు ఆరా తీస్తోంది.

# పాలవలస కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ..

మొదటి పేజీ తరువాయి

అంతకు ముందు రాజశేఖరం మృతిపై సంతాపం వ్యక్తం చేసిన వైఎస్ జగన్.. ఫోన్ ద్వారా ఆ కుటుంబంతో మాట్లాడి సంఘీభావం తెలిపారు. ఇప్పుడు నేరుగా ఆ కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. పాలకొండ పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ తొలుత విశాఖపట్నం చేరుకున్నారు. ఆ సమయంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. పార్టీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌తో కాసేపు జగన్ చర్చించారు. పాలవలస రాజశేఖరం కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ పాలసవలస కుటుంబం తరతరాలుగా రాజకీయాల్లో ఉంది. సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన రాజశేఖరం.. ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. వైఎస్సార్‌తోనూ రాజశేఖరం మంచి అనుబంధం కొనసాగించారు. ఆపై వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన కుటుంబ సభ్యులు ప్రస్తుతం రాజకీయాల్లో కీలకంగా ఉన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ రాజశేఖరం తనయుడే. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఈయన కుమార్తె.

# చంద్రబాబును నమ్మడమంటే పులినోట్లో తలపెట్టడమేనని అప్పుడే చెప్పా

మొదటి పేజీ తరువాయి



భూమిని ఢీకొట్టే అవకాశం 3.1 శాతం పెరిగింది. ఈ ఆస్టరాయిడ్ ఢీకొనే అవకాశమున్న రిస్క్ కారిడార్‌లో తూర్పు పసిఫిక్ మహాసముద్రం, దక్షిణ అమెరికాలోని ఉత్తరభాగం, అట్లాంటిక్ మహాసముద్రం, అరేబియా సముద్రం, దక్షిణాసియా తదితర ప్రాంతాలు ఉన్నాయి. ముంబై, కోల్‌కతా, ఢాకా, బొగొటా, అబిడ్జాన్, లాగోస్, ఖార్టూమ్ లాంటి ఏడు ప్రధాన నగరాలు ఇందులో ఉండటం ఆందోళనకరం. ఈ నగరాల్లో సుమారు 110 మిలియన్ల మంది నివసిస్తున్నారు.

రిస్క్ జాబితాలో చోటు

ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్ వార్నింగ్ నెట్‌వర్క్ నేతృత్వంలో భూమిపై నుంచి టెలిస్కోప్ ద్వారా చేస్తున్న పరిశీలనల ద్వారా ఇది ఏప్రిల్ వరకు కనిపిస్తుంది. ఆ తర్వాత 2028 జూన్ వరకు కనిపించకుండాపోయే అవకాశం ఉంది. 'ఇది భూమిని ఢీకొట్టే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నప్పటికీ.. 2032 డిసెంబర్ 22 నాటికి మరో 2.3 శాతం పెరిగే అవకాశం ఉంది. గతంలోనూ ఇలాంటి ఎన్నో ఖగోళ వస్తువులు కనిపించాయి. ఆ తర్వాత రిస్క్ లిస్ట్ నుంచి తొలగిపోయాయి' అని ఫిబ్రవరి 7న తన నివేదికలో నాసా తెలిపింది.

ప్రమాదం తొలగేనా?

ఈ ఆస్టరాయిడ్‌ను 2024 డిసెంబర్ 24న ఖగోళ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. డిసెంబర్ 31న నాసా రిస్క్ లిస్ట్‌లో చోటు దక్కించుకున్న తర్వాత దీనిపై ఖగోళ శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. ప్రకాశం (బ్రైట్‌నెస్) ఆధారంగా దాని పరిమాణం 130-300 అడుగుల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇది భూమిని ఢీకొట్టకపోతే అంతరిక్షంలోనే 8 మెగాటన్నుల టీఎన్‌టీ శక్తితో పేలిపోయే ఆస్కారముందనిశాస్త్రవేత్తలు చెబుతున్నారు. హిరోషిమాపై ప్రయోగించిన బాంబు కంటే 500 రెట్లు ఎక్కువ శక్తి కలిగిన ఇది అత్యంత బలమైన అంతరిక్ష శిలగా గుర్తింపు పొందింది. 2024 వైఆర్4 గ్రహశకలం సిటీ కిల్లర్‌గా గుర్తింపు పొందింది. భూగ్రహానికి ప్రమాదకారి కానప్పటికీ, ఒక నగరాన్ని తుడిచిపెట్టే సామర్థ్యం దీనికి ఉంది. అయితే, ఈ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొట్టేందుకు 2.3 శాతం మాత్రమే అవకాశాలు ఉన్నట్టు గతంలో నాసా అంచనా వేసింది.

# ఏపీలో 25 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులే లక్ష్యంగా అడుగులు

మొదటి పేజీ తరువాయి



మంత్రి మాట్లాడుతూ, పర్యాటక రంగంలో ఉత్తేజం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించిందని, తద్వారా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ పర్యాటకరంగానికి కూడా వర్తిస్తాయని తెలిపారు. ఏపీలో పర్యాటక అభివృద్ధి కోసం నూతన టూరిజం పాలసీ 2024-29ని తీసుకువచ్చామని వివరించారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా టూరిజం సర్క్యూట్‌లు, యాంకర్ హబ్‌లు, థీమాటిక్ అప్రోచ్ ఏర్పాటు, అంతర్జాతీయ మౌలిక వసతుల కల్పన వంటి విభిన్న కార్యక్రమాలు, పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు తొలి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలో టెంపుల్, అడ్వెంచర్, ఎకో, వెల్ నెస్, హెరిటేజ్, రిలీజియస్, అగ్రి, మెడికల్, క్రూయిజ్, బీచ్, కోస్టల్, సీప్లేన్, ఫిల్మ్ టూరిజంను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. పర్యాటక రంగం ద్వారా 15 శాతం ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు ఆహ్లాదంగా ఉంటూ ఎక్కువ రోజులు గడిపేలా మెరుగైన సేవలు, మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి దుర్గేశ్ అన్నారు.

## ఇష్టానుసారం చేస్తానంటే కుదరదు
## జగన్ కు చంద్రబాబు కౌంటర్



అమరావతి: వైసీపీ అధినేత జగన్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు కౌంటర్ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా జగన్ గుంటూరు మిర్చి యార్డు పర్యటనకు వెళ్లడంపై సీఎం మండిపడ్డారు. ఈసీ ఆదేశాలను ఉల్లంఘించి ఇష్టానుసారం చేస్తానంటే కుదరదని చెప్పారు. అక్రమాలు చేస్తా... పోలీసుల రక్షణ ఇవ్వాలంటే ఎలాగని ప్రశ్నించారు. రాజకీయ నాయకులు ప్రజాస్వామ్యయుతంగా ప్రవర్తించాలని అన్నారు. రౌడీయిజం చేయడం సరికాదని అన్నారు. ఈ ఏడాది ఎప్పుడూ లేనంతగా మిర్చి రేట్లు పడిపోయాయని చంద్రబాబు చెప్పారు. విదేశాల్లో డిమాండ్ తగ్గడం వల్ల మిర్చి రేట్లు తగ్గాయని అన్నారు. మిర్చి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మిర్చి ఎగుమతులు ఎందుకు తగ్గాయో సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సాగు ఖర్చులను రియలిస్టిక్ గా వేసి ధరలు నిర్ణయించాలని అన్నారు. దీనిపై కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో చర్చించామని తెలిపారు. ధరల స్థిరీకరణకు ఏం చేయాలో ఆలోచిస్తామని చెప్పారు. కేంద్ర వాణిజ్యశాఖతో మరిన్ని సంప్రదింపులు జరుగుతాయని తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో పోలవరం ప్రాజెక్టు గురించి చర్చించామని చంద్రబాబు వెల్లడించారు. 2027లోపు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వ చేతకానితనం వల్ల కేంద్ర నిధులను వాడుకోలేకపోయామని విమర్శించారు. అన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.

# ప్రకృతి సేద్యానికి అమెరికా సంస్థల సహకారం..

మొదటి పేజీ తరువాయి



పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఛైర్మన్ క్రేయిగ్ కోగుట్, ఆపరేటింగ్ అడ్వైజర్ గినా మెగ్‌కార్తీ, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సీఈవో కీత్ అగోడా ముఖ్యమంత్రితో సచివాలయంలో భేటీ అయ్యారు. దావోస్ సమావేశానికి కంటిన్యూ మీటింగ్‌గా జరిగిన ఈ సమావేశంలో రానున్న రోజుల్లో కలిసి పనిచేసే అంశాలపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయం, భిన్నమైన వాతావరణాన్ని తట్టుకోగల పంటలను అందించడం, రైతు నుండి వినియోగదారు వరకు ఎండ్-టు-ఎండ్ అనుసంధాన వ్యవస్థను రూపొందించడం, మార్కెట్ డెవలప్‌మెంట్, ఫైనాన్సింగ్, డేటా మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయడంపై ఈ సంస్థలు సహాయపడనున్నాయి. పబ్లిక్, ప్రైవేట్ సంస్థల నుంచి ఆర్థిక సాయాన్ని అందించేందుకు సహకారాన్నిస్తాయి. ప్రకృతి వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ కోసం ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రమోట్ చేస్తాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన రైతు సాధికార సంస్థతో పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థలు ఎంఓయూ చేసుకోనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అవకాశాలను, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను, ప్రస్తుత పరిస్థితులను ఆ సంస్థల ప్రతినిధులకు వివరించారు. ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయని....ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతోందని అన్నారు. తాము తీసుకునే ఆహారంపై వారు అవగాహన కోరుకుంటున్నారన్నారు. రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తుల సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ అనేది కీలకం కానుందని అన్నారు. ఆ దిశగా తాము రైతులను, ఉత్పత్తిదారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రకృతి సేద్యం తన కల అని చెప్పిన సిఎం....రైతుల్లో చైతన్యం తెచ్చి అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి సహకరించాల్సిందిగా ఆ సంస్థల ప్రతినిధులను కోరారు.

## ఢిల్లీ సీఎం రేఖాగుప్తా ప్రమాణ స్వీకారంలో అనుకోని అతిథి!

మొదటి పేజీ తరువాయి



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి, తర్వాత జరుగుతున్న వరుస రాజకీయ పరిణామాలతో ఆప్ ఇమేజ్ డ్యామేజీ అయ్యేందుకు పరోక్షంగా స్వాతి మాల్ కారణమవుతున్నారు. గతేడాది మేలో ఆప్‌లో అంతర్గతంగా కొనసాగుతున్న కుమ్ములాటలపై చర్చించేందుకు కేజ్రీవాల్ తనని ఆహ్వానించారని, అలా వెళ్లిన తనపై కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్ కుమార్ దాడి చేశారని ఆరోపించారు. ఆ తర్వాత అక్టోబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమిని తన సొంత పార్టీ ఆమ్ ఆద్మీ మోసం చేసి ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేసిందన్నారు. కాబట్టే ఆప్‌కు కేవలం రెండు శాతం ఓట్లు పడినట్లు కేజ్రీవాల్‌పై ఎదురుదాడికి దిగారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేజ్రీవాల్ నివాసం ఎదుట యమునా నది శుద్ధి చేయాలనే హామీని నెరవేర్చలేదని ఆరోపిస్ స్వాతి మలివాల్ ఆందోళన చేపట్టారు. స్వాతి మాలివాల్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల ఫలితాల్లో ఆప్ ఓటమినిపై పరోక్షంగా స్పందించారు. కేజ్రీవాల్‌ను టార్గెట్ చేస్తూ ఎక్స్ వేదికగా మహాభారతంలోని ద్రౌపది వస్త్రాభరణం ఫోటోను షేర్ చేశారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై ఆప్ ఓటమికి కేజ్రీవాల్ కారణమని అన్నారు. ఒక వ్యక్తి అహంకారంతో పనిచేయాలని చూస్తే ప్రజలు ఇలాగే బుద్ధి చెబుతారు. కేజ్రీవాల్ విషయంలో అది ఈరోజే జరిగింది'అని వ్యాఖ్యానించారు. గొప్ప విజన్‌తో రాజకీయాల్లోకి వచ్చాం. ఆప్‌లో అదే విధంగా పనిచేశాం. కానీ నాయకత్వం ప్రజాస్వామ్యాన్ని నమ్మకపోవడం, అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయగలమని అనుకోవడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఆప్ వీడి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నిస్తే. నేనెందుకు రాజీనామా? చేయాలి. నేను ఏమైనా తప్పుచేశానా? అని ప్రశ్నించారు. ఆప్ ఎంపీగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ప్రశ్నించినందుకే రాజీనామా చేస్తారా? అని ధ్వజమెత్తారు. ఇలా కేజ్రీవాల్‌ను రాజకీయంగా దెబ్బతీస్తున్న స్వాతిమాల్ తాజాగా, బీజేపీ ఎమ్మెల్యే రేఖాగుప్తా ఢిల్లీ సీఎంగా ప్రమాణ స్వీకారానికి హాజరై చర్చాంశనీయంగా మారారు.

## 'ఎస్సీ వర్గీకరణలో సీఎం రేవంత్ పాత్ర ఏమీ లేదు'



హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర ఏమీ లేదని విమర్శించారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. కల్వకుంట్ల కవిత నివాసంలో గురువారం దళిత బంధు సాధన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ' ఎస్సీ వర్గీకరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర ఏమీ లేదు. వర్గీకరణ విషయంలో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. సుప్రీం కోర్టు తీర్పు వల్ల వర్గీకరణకు బాటలు పడ్డాయి. షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికను బయటపెట్టి.. వెంటనే వర్గీకరణ చేయాలి. దళితుల మధ్య పంచాయతీ పెట్టవద్దు... ఎవరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ ఉండాలి. ఎస్సీ వర్గీకరణ పేరు చెప్పి సీఎం రేవంత్ రెడ్డి మరో మోసం చేశారు. వర్గీకరణకు, ఉద్యోగాల కల్పనకు ముఖ్యమంత్రి లింక్ పెడుతున్నారు. వర్గీకరణ వంకతో జాబు క్యాలెండర్ అమలును నిలిపివేయవద్దు. కోర్టు తీర్పు వచ్చి 6 నెలలు గడిచినా ఆలూలేదు చూలు లేదన్నట్లుగా ఉంది. రేవంత్ రెడ్డి మాటలు చెబితే నమ్మరని ఢిల్లీ నుంచి ప్రియాంగా గాంధీని తీసుకొచ్చి హామీ ఇప్పించారు. దళిత కుటుంబాలకు రూ. 10 లక్షలకు బదులు 12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. ముఖ్యమంత్రికి ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిన సీఎం రేవంత్ రెడ్డి..రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుదేలు చేశారు ఇప్పటికే కేసీఆర్ మంజూరు చేసిన దళిత బంధు నిధులను విడుదల చేయాలి. ధైర్యం ఉంటే 18 వేల దళిత కుటుంబాలకు దళిత బంధు డబ్బులను డిమాండ్ చేయాలి. బడ్జెట్ ప్రవేశపెట్టే ముందే ఈ డబ్బులు విడుదల చేయాలి. ఎస్సీలకు బడ్జెట్ లో 33 వేల కోట్లు కేటాయించి... కేవలం 9800 కోట్లే ఖర్చు చేశారు. ముందుచూపుతో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కు కేసీఆర్ చట్టబద్ధత కల్పించాలి. రేవంత్ రెడ్డిది మనసున్న ప్రభుత్వం కాదు.. మానవత్వం లేదు. రేవంత్ రెడ్డి ఆలోచన చిన్నది ... చూపు పెద్దవాళ్లపైనే ఉంది. అందుకే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలదండ కూడా వేయలేదు. అంబేద్కర్ ఆయన వారసులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారు. అంబేద్కర్ జయంతిలోపు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి కేబినెట్ మొత్తం వెళ్లి పూలదండలు వేయాలి. లేదంటే ప్రభుత్వం మూసివేసిన గేట్లను బద్దలుకొట్టి మేమే అంబేద్కర్ ను గౌరవించుకుంటాం. అంబేద్కర్ ని గౌరవించని ముఖ్యమంత్రి... మన ఆకలిని అర్థం చేసుకుంటారా ? , అట్టడుగు వర్గాల వారిని వేలు పట్టుకొని ముందుకు నడిపించాలన్నది కేసీఆర్ ఆలోచన. పేదలు, అణగారిన వర్గాల కోసం పనిచేయాలని కేసీఆర్ ఎప్పుడూ అంటున్నారు. దళితులను ధనవంతులను చేయాలన్న ఉద్దేశంతో దళిత బంధును ప్రవేశపెట్టారు. ఎన్నికల కోసం... రానున్న తరాల కోసం కేసీఆర్ ఆలోచిస్తారు. అన్ని వర్గాలకు ఆత్మబంధువు అంబేద్కర్. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైంది రెండు మూడేళ్ల తర్వాత బీఆర్ఎస్ పార్టీ అధికారంలో వస్తుంది' అని కవిత స్పష్టం చేశారు.

## ఆర్ ఐ ప్రసాద్ కి రైతు సంఘం నాయకులు వినతి పత్రం




దోర్నాల, మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలంలోని తాసిల్దార్ కార్యాలయం నందు ఆర్ ఐ ప్రసాద్ కి రైతు సంఘం నాయకులు రాష్ట్ర బడ్జెట్లో వెలుగొండ ప్రాజెక్టుకు రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని 20 25 వరద సీజన్ నాటికి వెలుగొండ ప్రాజెక్టు నీరు విడుదల చేయాలని నిర్వాసితులకు ఆర్ అండ్ ప్యాకేజ్ వెంటనే చెల్లించాలని యువతి యువకులకు కటాఫ్ తేదీని పెంచాలని వెలుగొండ జలాల సాధనకై సిద్ధం కావాలని పరివాహక మండలమైన పెద్ద దోర్నాలలో వినతి పత్రం అందించడం జరిగినది ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డిమండల నాయకులు దావీదు ఏసేపు సుంకన్న పిచ్చయ్య కుమారి మరియు రైతులు పాల్గొన్నారు.

## జ్ఞాన జ్యోతి శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్



సింగరాయకొండ సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తజాలయ్య (శుభోదయం న్యూస్ ):- సింగరాయకొండ, ప్రకాశం జిల్లా: సింగరాయకొండ మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న "జ్ఞాన జ్యోతి" శిక్షణా శిబిరాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, సీడీపీఓ మల్లీశ్వరి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పూర్వ ప్రాథమిక విద్య 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల భవిష్యత్తుకు కీలకమైనదని, ఈ దశలో శారీరక, మానసిక, భాషా



మరియు మేధస్సు అభివృద్ధి అత్యధికంగా జరుగుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సమగ్ర శిక్షణ పొంది, చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. అనంతరం, శిక్షణలో కార్యకర్తలు రూపొందించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మేళాను వారు సందర్శించారు. శిక్షణా ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, జిల్లా రిసోర్స్ పర్సన్స్ అర్రిబోయిన రాంబాబు, షేక్ రిజ్వాన, కీర్తి శ్రీనివాసరావు, సైదాబీ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మరియు 62 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాకల ఉపాధ్యాయుడి రచనకు ప్రభుత్వ గుర్తింపు "వెలుగు దివ్వెలు" ఎంపిక



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- సింగరాయకొండ, ప్రకాశం జిల్లా: పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య గారికి అరుదైన గౌరవం లభించింది. ఆయన రచించిన వచన కవితా సంపుటి "వెలుగు దివ్వెలు" (సైటేషన్ నం: 647బిసా.తె 800బి2082023) ఏపీ ప్రభుత్వ పౌర గ్రంథాలయ శాఖ ద్వారా ఎంపిక చేయబడింది. 2022-23 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఏపీ ప్రభుత్వ పౌర గ్రంథాలయ శాఖ సమావేశంలో ఈ ఎంపికను అధికారికంగా ఖరారు చేశారు. ఆమోదం పొందిన పుస్తకాల వివరాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా హజరత్తయ్య గారు మాట్లాడుతూ, తాను రచించిన పుస్తకాన్ని ఎంపిక చేసిన ఏపీ ప్రభుత్వ పౌర గ్రంథాలయ శాఖకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ గౌరవాన్ని పురస్కరించుకొని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, కవులు హజరత్తయ్య గారికి అభినందనలు తెలిపారు.

## బీజేపీ జిల్లా అధ్యక్షులు శగ్గం శ్రీనివాసరావుకు సన్మానం



దోర్నాల, మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్): భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు శగ్గం శ్రీనివాసరావును గురువారం దోర్నాల మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు కుటుంబసమేతంగా శ్రీశైలం వెళ్తున్న ఆయన దోర్నాలలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా బీజేపీ మండల పార్టీ కన్వీనర్ సురవరం గండి వీరారెడ్డి, తంగిరాల సీతారెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీను, లక్ష్మిరెడ్డి తదితర నాయకులు వారికి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ బలోపేతంపై చర్చించారు.

## భౌతిక కాయానికి నివాళులు అర్పించిన గూడూరి ఎరిక్షన్ బాబు



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్): దోర్నాల మండలం చిన్నగుడిపాడు గ్రామంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు దొడ్డా శేషాద్రి గారి మాతృమూర్తి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు , రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు కాకర్ల కోటయ్య, దోర్నాల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మల్లికార్జున రెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ టి ఎన్ టి యు సి ప్రధాన అధ్యక్షులు బట్టు సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, షేక్ మాబు, కడిమెట్ల శ్రీను, మరియు దోర్నాల మండల తెలుగుదేశం పార్టీ మరియు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

## రైతులపై జగన్ ది కపట ప్రేమ : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): తన హయాంలో రైతాంగ సమస్యలు పట్టించుకోని జగన్ అధికారం కోల్పోయాక రైతుల పక్షాన నిలబడి ఉన్నానంటూ పర్యటనలు చేస్తూ మిర్చి యార్డుకు వెళ్లి రైతులపై కపట ప్రేమ వలకబోస్తూ మాట్లాడడం అశ్చర్యంగా ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సత్రశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చేందుకు తన ప్రభుత్వంలో సంస్కరణలు కూటమి ప్రభుత్వంలో నిర్వీర్యమైనాయని ఆరోపిస్తూ జగన్ మిర్చి యార్డులో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ డిమాండ్ చేయటం హాస్యస్పదమన్నారు. వాస్తవానికి 2020 సెప్టెంబర్ లో గుంటూరు మిర్చి యార్డ్ లో క్వింటాల్ మిరప ధర రూ.12 వేలు ఉంటే,రూ. 7 వేలు మద్దతు ధర ప్రకటిస్తూ జీవో ఇచ్చింది నీవు కాదా జగన్ ?అని ప్రశ్నించారు. వాస్తవానికి 2022- 23, 2023- 24 లో మాత్రమే మిర్చి ధర రూ.20 వేలకు చేరితే తన హయాంలో రూ. 27 వేలు ధర పలికిందంటూ జగన్ మతిభ్రమించి అబద్ధాలు వల్లె వేస్తున్నాడని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యంతో రెండు లక్షల ఎకరాల్లో మిర్చి సాగు విస్తీర్ణం తగ్గిందని ఆరోపిస్తున్న జగన్ ఆ విస్తీర్ణంలో రైతులు పత్తి, కందులు, మొక్కజొన్న తదితర పంటలు వేశారన్న అవగాహన లేకుండా మాట్లాడటం తగదన్నారు. 2017లో మిర్చి ధర తగ్గిపోతే నాటి తెలుగుదేశం ప్రభుత్వం తొలిసారి ధరల స్థిరీకరణ నిధి కింద రూ. 130 కోట్లు ఇచ్చి ఆదుకుంటే, 2020 సెప్టెంబర్ లో జగన్ ప్రభుత్వం జీవోలో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసినట్లు ప్రకటించి ఒక్క పైసా ఇవ్వకుండా రైతులను దగా చేసిందన్నారు. ధాన్యం రైతులకు రూ.1600 కోట్లు బకాయిలు పెట్టి జగన్ వెళ్లిపోతే నేడు కూటమి ప్రభుత్వం రైతులకు ఆ బకాయిలు చెల్లించిదన్నారు. ప్రజా సమస్యలు చర్చించడానికి అసెంబ్లీకి రాని జగన్ నేరచరిత్ర గల వారిని పరామర్శించేందుకు మాత్రం జైలుకు వద్దకు వెళతాడన్నారు. తన హయాంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన జగన్ తాను మళ్లీ అధికారంలోకి వస్తానని పగటి కలలు కంటున్నాడని ఎమ్మెల్యే విమర్శించారు. సమావేశంలో పలువురు మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## పట్టభద్రుల (గ్రాడ్యుయేట్స్) ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



శుభోదయం నూస్ పిడుగురాళ్ల టౌన్ రిపోర్టర్ శీనివాసరావు: పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పట్టభద్రుల (గ్రాడ్యుయేట్స్) ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సి ఆర్ రాజన్,



యువ నాయకులు యరపతినేని నిఖిల్, మరియు కూటమి నాయకులు ఉపాధ్యాయులను, మరియు అంగన్వాడి టీచర్లను కలసి, కూటమి పట్టభద్రుల (గ్రాడ్యుయేట్స్) ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరటం జరిగింది.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థిని గెలిపించండి



దెందులూరు, శుభోదయం న్యూస్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థిని గెలిపించండి - రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కూటమి ప్రభుత్వానికి గ్రాడ్యుయేట్లు అంతా కలిసి మీ మద్దతు తెలపండి - వైసిపి పాలనలో గాడి తప్పిన, తిరోగమనం పాలయిన రాష్ట్ర అభివృద్ధికి పునర్వైభం తీసుకురావటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది - విజ్ఞత కలిగిన పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పెరాబత్తుల రాజశేఖరంకి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించవలసిందిగా కోరుతున్నాను": దెందులూరు మండలంలో



జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యాఖ్యాగురువారం ఉదయం దెందులూరు నియోజకవరం దెందులూరు మండలంలోని పోలీస్ స్టేషన్, మండల అభివృద్ధి కార్యాలయం సహా పలు ప్రభుత్వ కార్యాలయాల లోని పట్టభద్రులకు పలు గ్రామాల్లోని పట్టభద్రులకు కర పత్రాలు అందించి, కూటమి నాయకులతో కలిసి విస్తృత స్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్.

## వేసవికాలంలో త్రాగునీటి సమస్యల పై ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు..!!!

గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తున్న గ్రామ సర్పంచ్ నారాయణరావు...!!!




విజయనగరం,జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనివాస్,(శుభోదయం న్యూస్):విజయనగరం జిల్లా,బొబ్బిలి మండలం,శివడవలస గ్రామ ప్రజలకు వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో త్రాగునీటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ వెంగల నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బైరిపురం మెయిన్ రోడ్డు సెంటర్ లో ఉన్నటువంటి వాటర్ ట్యాంక్ త్రాగునీటి ట్యాంకును పరిశు




భ్రం చేయించారు. అనంతరం ట్యాంక్ లోని త్రాగునీటిని క్లోరినేషన్ చేయించారు. అలాగే త్రాగునీటి సమస్య గ్రామానికి వేసవిలో ఎక్కువగా వస్తుందని దృష్టిలో పెట్టుకొని మన బీసీ కాలనీ వెనకాల ఉన్న బోరు ద్వారా మన ట్యాంకుకి నీటిని సప్లై చేయించి ఆ నీటిని పంపవాని గ్రామానికి పంపించే ఏర్పాట్లు అప్పట్లో చేశామని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం మన గ్రామానికి వేసవిలో ఎలాంటి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## గ్రంథాలయ వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా సెక్రెటరీ



యాడికి ఫిబ్రవరి 20 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ )మండల కేంద్రంలోని పంచాయతీ ఆఫీస్ లో ఉన్న గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సెక్రెటరీ గురువారం తనిఖీ చేయడం జరిగింది. జిల్లా గ్రంథాలయ సెక్రెటరీ రమ వార్షిక తనిఖీ చేయడం జరిగినది. గ్రంథాలయం సంబంధించి గ్రంథాలయ అధికారి మధుసూదన్ ను అడిగి పలు రికార్డులను తనిఖీ చేయడం జరిగినది. గ్రంథాలయము పరిశుభ్రముగా మరియు పుస్తకములు క్రమపద్ధతిలో ఉన్నాయని కొనియాడారు.

## మున్సిపాలిటీ సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమీక్షా సమావేశం



కనిగిరి, రిపోర్టర్ జి. ప్రసాదరావు (శుభోదయం న్యూస్): కనిగిరి మున్సిపాలిటీ సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమీక్ష సమావేశం అమరావతి గ్రౌండ్స్ లో జరిగింది. ఈ సందర్భంగా ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి రెడ్డి మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని,ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలి. సచివాలయాల్లో అడ్మిన్లు బాధ్యత తీసుకొని అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి.కళాశాలలు పాఠశాలల వద్ద మహిళా పోలీసులు విద్యార్థినిలకు అసౌకర్యం లేకుండా రక్షణ కల్పించేలా చొరవ చూపించాలి -మున్సిపాలిటీలో అన్ని వార్డులలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



చేపట్టాలి అక్రమ లేవట్లపై కఠిన చర్యలు చేపట్టాలి నిబంధనల మేరకు వెంచర్లు వేసేలా అందులో రోడ్లు, డ్రైనేజీ, లైట్లు వంటి సౌకర్యాలు ఉండేలా అవగాహన కల్పించాలి -మున్సిపాలిటీ పరిధిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా టాక్స్ కట్టి అనుమతి తీసుకోవాలి అలా చేయకుంటే తొలగించాలి ఈ ఆరు నెలల కాలంలో మున్సిపాలిటీకి ఫ్లెక్సీల ఏర్పాటు ద్వారా రెండు పాయింట్ 25 లక్షల ఆదాయం వచ్చింది ఈ విధానాన్ని కొనసాగించాలి 20 వార్డులలో ఆక్రమణలు ఏమైనా ఉంటే ఈ నెలాఖరులోపు గుర్తించి విధిగా అధికారులకు సమాచారం ఇవ్వాలిపక్కా గృహాల నిర్మాణం కోసం పొజిషన్ సర్టిఫికెట్లను ఇబ్బందులు పెట్టకుండా అందజేయాలంటూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## కావలిజనసేనపార్టీ కార్యాలయములోక్యాలెండర్ ఆవిష్కరణ




కావలి: (శుభోదయం న్యూస్) : జనసేనపార్టీకావలినియోజకవర్గ కార్యాలయములోఆంధ్రప్రదేశ్ కాపుటీచర్స్వెల్ఫేర్అసోసియేషన్ క్యాలెండర్ నుకావలిజనసేనపార్టీ ఇంచార్జ్ అళహరిసుధాకర్ గురువారంఆవిష్కరించారు. ఈ సందర్భంగాఆయనమాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాపుటీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులఅందరూతనకు అత్యంతఆప్తులని, వారుచేస్తున్న ఉపాధ్యాయవృత్తిలోఎంతో మందనివిద్యావంతులనుచేసిఉద్యోగ,ఉపాధిఅవకాశాలు కల్పించడమేకాక అపారమైన జ్ఞానాన్నిఇచ్చి వారినితీర్చి దిద్దుతున్నారనికొనియాడారు. అధికారంలోఉన్నఉమ్మడిప్రభుత్వంలో వీరికిరావాల్సినఅన్నిసౌకర్యాలు ప్రభుత్వంతప్పక కల్పిస్తుందనీ ఇదివరకుప్రభుత్వంలోలాగా మద్యందుకాణాలదగ్గరకాపలాఉద్యోగాలుమాత్రంచేయించదని, వారినిగౌరవప్రదంగాచూసుకొనే పరిస్థితిఉంటుందనితెలిపారు. అదేక్రమంలోవారికిఏదైనాసమస్య వచ్చినా అదితమదృష్టికి తీసుకొనివస్తేఅధ్యక్షుడుపవన్ కళ్యాణ్ దృష్టికితీసుకువెళ్లి సమస్యపరిష్కరించేవిధంగాకృషి చేస్తాననితెలిపారు. పైకార్యక్రమలో రాష్ట్రకార్యవర్గసభ్యులు డా.జి. శివ,నెల్లూరుజిల్లాప్రధానకార్యదర్శి హజరతయ్య మరియుఏపీకాపుటీచర్లసంగం కావలినియోజకవర్గకార్యవర్గ గౌరవాధ్యక్షులుసానం కృష్ణ,అధ్యక్షులుపర్వతరెడ్డివెంకట నాగసుధాకర్, ప్రధానకార్యదర్శి తిరుమలశెట్టి లక్ష్మినారాయణ, ఆర్థికకార్యదర్శి అలహరి రామారావు, సహకార్యదర్శులు యానాంశశిధర్, సభ్యులుగాదిరెడ్డి మురళికృష్ణ, సుధీర్ తదితరు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధి, గుర్తింపు చంద్రబాబుతోనే సాధ్యం

### యానాది హక్కుల పోరాట సమితి ప్రెసిడెంటతిరువీధుల శంకర ప్రసాద్




ఫిబ్రవరి20 బాపట్ల పట్టణం (శుభోదయం న్యూస్) : టీడీపీ పార్టీ ఆఫీస్ లో జరిగిన ప్రెస్ మీటింగ్, టీడీపీ లీడర్, యానాది హక్కుల పోరాట సమితి ప్రెసిడెంట్ తిరువీధుల శంకరప్రసాద్ మాట్లాడుతు ఈ ఆంధ్రప్రదేశ్ లో గిరిజనులను గుర్తొచ్చిన పార్టీ టీడీపీ అని గతంలో గిరిజనులకు టీ.టీ.సీ, బి.ఈ. డి, లేకుండా లకు ముందు టీచర్ పోస్ట్ ఇచ్చి తరువాత ట్రైనింగ్ ఇచ్చిన పార్టీ టీడీపీ, %@%ఆర్. టీ. సి. లేడీ కండక్టర్ పోస్ట్ కూడా ఇచ్చినది కూడా మా సి. యం. నారా చంద్రబాబు గారు ఇపుడు కూడా బాపట్ల జిల్లాకు స్టువర్ట్ పురం గ్రామమంలో నుండి వచ్చిన ఓ గిరిజన మహిళ తొలిసారి ఓ యూనివర్సిటీకి వీసీగా మారారు. ఆమే సాతుపాటి ప్రసన్నశ్రీ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమెను రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా నియమించారు రాష్ట్రంలో వీసీగా నియమితురాలైన తొలి ఎరుకలి సామాజికవర్గ మహిళ ఆమే కావడం విశేషంస్టూవర్టుపురానికి చెందిన ఆమె తండ్రి ప్రసాదరావు రైల్వేలో వైద్యాధికారి తల్లి వసుంధరాదేవిసర్దార్ పటేల్ మహావిద్యాలయలో పీహెచ్‌డీ చేసిన ఆమె తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం మొదలుపెట్టారు విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా రెండు దశాబ్దాలకు పైగా పని చేశారు.

## లక్షలాది ఉద్యోగాల సృష్టికర్త ఆంధ్రప్రదేశ్ ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



(శుభోదయం న్యూస్) ఫిబ్రవరి20 బాపట్ల పట్టణం : ముప్పలనేని శ్రీనివాసరావు, శేషు సుమంత్ మర్యాద పూర్వక భేటీబాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు యువ పారిశ్రామికవేత్త ముప్పలనేని శేషు సుమంత్ గురువారం నాడు రాజధాని అమరావతి లో ఆంధ్రప్రదేశ్ ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా వ్యక్తిగతంగా కలిసి ఆంధ్రప్రదేశ్ లో లక్షలాది ఉద్యోగాల కల్పన మరియు విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలె ధ్యేయంగా వారు చేస్తున్న కృషిని అభినందించినట్లు ముప్పలనేని ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారునారా లోకేష్ బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ పెద్దలు కీర్తిశేషులు ముప్పలనేని శేషగిరిరావు గారు ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో బాపట్ల ఒకటిగా చేసిన కృషిని గుర్తు చేస్తూ ఇంజనీరింగ్ కాలేజీ విద్యకు ఆధునికతను జోడిస్తూ కాలేజీ ని అభివృద్ధి చేయవలసిందిగా దానికి ప్రభుత్వపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

## మొక్కులు చెల్లించి.. అభిమానం చాటి



రెంటచింతల, మండల రిపోర్టర్– శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, నియోజవర్గం ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మారెడ్డి గెలుపును కాంక్షిస్తూ సత్రశాల ఆలయ కమిటీ మాజీ ఉత్సవ చైర్మన్ , తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు ఏచూరి వెంకట సైదయ్య గత సంవత్సరం ఎన్నికల సమయంలో చేసిన మొక్కుబడి కల గురువారం సత్రశాల సన్నిధిలో మొక్కుబడి చెల్లింపుతో నెరవేర్చుకుని ఎమ్మెల్యే బ్రహ్మ రెడ్డి పట్ల తన అభిమానాన్ని చాటుకున్నారు. గురువారం ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ప్రాచీన శైవ క్షేత్రం సత్రశాల ఆగమనంతో మల్లికార్జున స్వామి దర్శనం అనంతరం ఆయన ఆ ఆయన ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద 108 కొబ్బరికాయలు ఎమ్మెల్యేతో, మిగతా టీడీపీ నేతలు, కార్యకర్తలతో కొట్టించి మొక్కు చెల్లించుకున్నారు. అభిమానిగా తన గెలుపును కాంక్షించిన వెంకట సైదయ్యను ఎమ్మెల్యే అభినందించారు. 2016 సంవత్సరంలో వెంకట సైదయ్య సత్రశాల ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గా వ్యవహరించారు. అలాగే ప్రస్తుతం వై ఆర్ ఎస్ హై స్కూల్ కరస్పాండెంట్ గా ఉంటూ, ఇప్పటివరకు జరిగిన కానుక మాత తిరునాళ్ల వేడుకల్లో భక్తులకు గత 16 సంవత్సరాలుగా మంచినీరు, మజ్జిగ ఉచితంగా పంపిణీ చేస్తూ సామాజిక సేవలు అందిస్తున్నారు. అంతేగాక గాంధీజీ, పొట్టి శ్రీరాములు వర్ధంతి జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద విద్యార్థులకు, నిరుపేదలకు వస్త్రాలు వితరణ చేస్తున్నారు.

## చెలికాని సీతయ్యమ్మ మున్సిపల్ కూరగాయల మార్కెట్ షాపుల అద్దె (ధర) తగ్గించాలి...!!!

### వ్యాపారాలు లేక ఎంతగానో బాధపడుతున్న వ్యాపారస్తులు...!!

### సాయంత్రం 3:00 గంటలు దాటితే ఎవరు రాణి పరిస్థితిలలో ఉన్న చెలికాని సీతయ్యమ్మ మున్సిపల్ కూరగాయల మార్కెట్...!!!



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొడ్డాన.శ్రీనివాస్.(శుభోదయం న్యూస్):మున్సిపాలిటీ అధికారులు చూడండి మా పరిస్థితి అంటున్న వ్యాపారస్తులు...!!!బొబ్బిలి పురపాలక సంఘానికి చెందిన చలికాని సీతయ్యమ్మ మున్సిపల్ కూరగాయల మార్కెట్ అద్దె (ధర) తగ్గించాలని వారు మున్సిపాలిటీ అధికారులను ప్రజా ప్రతినిధులును వారు కోరారు. ఈ సందర్బంగా షాపు యాజమాన్లు మాట్లాడుతూ,,, వైయస్సార్సీపి ప్రభుత్వంలో షాపు అదే (ధర)950/- ఉండేది, మళ్లీ మూడు సంవత్సరాలు పోయాక 2750/-రూపాయలకి పెంచారు అని అన్నారు, సాయంత్రం మూడు గంటలు దాటితే ఒక్క కస్టమర్ కూడా రాని పరిస్థితుల్లో ఉన్నాం, ఇప్పుడు మున్సిపాలిటీ అధికారులు 3000/-రూపాయలు అద్దె కట్టమంటున్నారు ఇది ఎక్కడ న్యాయం.?అలాగే, కూరగాయల మార్కెట్ విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ ఉన్నాయని అన్నారు. సిబిఎం స్కూల్ పక్కన, చర్చ్ సెంటర్ పక్కన, పశువుల హాస్పిటల్ పక్కన, ఎలా పలుచోట్ల కూరగాయలు మార్కెట్లో ఉండడంతో మా వ్యాపారాలు ఎంతగానో దెబ్బతింటున్నాయి... మా బాధలు ఎవరితో చెప్పుకోవాలి అని అంటున్నారు. తక్షణమే మున్సిపాలిటీ అధికారులు బయట ఉన్న కూరగాయలు అమ్మకాల దారులను



పూర్తిగా నిర్మూలన చేసి మార్కెట్లో అమ్మే విధంగా పురపాలక అధికారులు చర్యలు తీసుకుంటే మా యొక్క వ్యాపారాలు సక్రమంగా జరుగుతాయని విలేకరులకు తెలియజేశారు. అలాగే బయట ఉన్న కూరగాయలు వ్యాపారాలను తీయించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు మున్సిపాలిటీ అధికారులు కోరారు...

## ఘనంగా దివంగత మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి 90వ జయంతి



వెంకటగిరి, నియోజకవర్గం ఇన్చార్జ్ - వీసీ సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): గురువారం తిరుపతి జిల్లా కోట మండలం లోని విద్యానగర్ లో ని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్ లో నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరమును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్.బి.కె.ఆర్ విద్యాసంస్థల అధినేత శ్రీ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ని ఎన్.బి.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఘనంగా స్వాగతించారు. రామ్ కుమార్ రెడ్డి మొదటగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు,అధ్యాపక సిబ్బంది,అధ్యాపకేతర సిబ్బంది తో కలిసి పూలమాలవేసి నివాళులర్పించిన్నారు. అనంతరం రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు, నేదురుమల్లి అభిమానులు, ఎం.బి.కె.ఆర్ విద్యాసంస్థలోని విద్యార్థిని విద్యార్థులను పలకరిస్తూ వారందరికీ అభినందనలు తెలియజేశారు. అనంతరం నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి నేదురుమల్లి విక్రమ్ రెడ్డి రక్తదానం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రివర్యులు స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి గారి 90వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు,కార్యకర్తలు, జనార్ధన్ రెడ్డి అభిమానుల అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కనుమరుగైపోతున్న కళలను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ కళాభవనను నిర్మించినారని చెప్పారు. జనార్ధన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ముందుకు నడుస్తానని చెప్పారు. జనార్ధన్ రెడ్డి గారికి విద్య పట్ల ఎంత మక్కువ ఉందో విద్యార్థులు గుర్తుపెట్టుకుని వారి పేరు మీద రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు, జనార్ధన్ రెడ్డి గారు 90వ సంవత్సరం లోకి అడుగు పెట్టిన సందర్భంగా జనార్ధన్ రెడ్డి గారిని గుర్తుపెట్టుకునే విధంగా, ఇదివరకు ఎప్పుడు చేయని విధంగా బ్రహ్మాండంగా మ్యూజికల్ ఫెస్టివల్ విద్యార్థుల కొరకు మార్చిలో చేయబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, మరియు చుట్టుపక్కల పరిసరాల ప్రాంతాల్లో ఉన్న జనార్ధన్ రెడ్డి అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఎంబీర్ ఫంక్షన్ హాల్ ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి జడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి, వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి



కనిగిరి రిపోర్టర్ జి.ప్రసా దరావు (శుభోదయం న్యూస్): కనిగిరి కందుకూరు రోడ్ లోని మూలే బాల్ రెడ్డి నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్ ఓపెనింగ్ పూజ లో పాల్గొని దంపతులను ఆశీర్వదించి మీ వ్యాపార అభివృద్ధి దినదినాభివృద్ధి చెందాలని దీవించారు. ఈ కార్యక్రమంలో మూ లే గోపాల్ రెడ్డి నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు సంగటి మహేంద్ర రెడ్డి, ఉడుముల లక్ష్మారెడ్డి మిట్ట రమేష్, మండల వాలంటరీ వింగ్ మడతల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు సంక్షేమ పథకాలు అందాలి



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు వారి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులు మరియు నిస్సహాయ స్థితిలో ఉన్న చిన్నారుల స్థితిగతులు తెలుసుకొనుట మరియు వారికై ఉన్న సంక్షేమ పథకాల అమలు గురించి ఇంటింటికి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ కందుకూరు కోర్టు సారథ్యంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ మరియు వైద్య శాఖ అందరి సమన్వయంతో గురువారం జరుగుమల్లి మండలంలోని గిరిజన కాలనీలో ఇంటింట సర్వే నిర్వహించారు. ముఖ్యంగా విభిన్న ప్రతిభవంతులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, లేదా అనే అంశంపై వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ కార్డులు ఉన్నాయా, లేవా, ఒకవేళ లేనివారికి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలలో ఆధార్ నమోదు చేసుకోవాల్సిందిగా హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు సూచించారు. కార్యక్రమంలో ఐ.సి.డి ఎస్. సూపర్వైజర్ పాల్గొన్న పి భారతి పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు వారి తల్లులకు తగు సూచనలు సలహాలు ఇస్తూ అంగనవాడి కేంద్రంలో ప్రతి నెల ఇస్తున్న పోషకాహారం తల్లులకు, పిల్లలకు అందుతున్నాయా,లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏ.ఎన్.ఎం. దైవ గీత, ఆశ కార్యకర్త నాగేశ్వరి,కందుకూరు కోర్టు సిబ్బంది,అంగన్వాడీ టీచర్ వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని బస్తు పట్టించిన గత వైసిపి ప్రభుత్వం : ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్



(శుభోదయం న్యూస్)అవనిగడ్డ,ఫిబ్రవరి 20: రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్న వైసీపీ ప్రభుత్వంపై తొలిసారి శంఖం ఊదింది విద్యావంతులే అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం సాయంత్రం అవనిగడ్డలోని ప్రగతి డిఎస్సీ కోచింగ్ సెంటరులో డీఎస్సీ విద్యార్థులతో మంత్రి సుభాష్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ జగన్ ఒక ఉన్మాది అని గ్రహించిన విద్యావంతులు, ఉపాధ్యాయులు వైసీపీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి సామాన్య ప్రజలను చైతన్యపరచి కూటమికి 93 శాతం స్ట్రైక్ రేట్ తో అత్యధికంగా 164 సీట్లు ఇచ్చారన్నారు. అదే స్ఫూర్తితో ఈనెల 27వ తేదీ జరిగే ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజవర్గానికి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాదును అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని మంత్రి సుభాష్ విజ్ఞప్తి చేశారు. ఒక నాయకుడు ఎలా ఉండకూడదో జగన్ వద్ద తెలుసుకున్నానని, నాయకులు అంటే ఎలా ఉండాలో కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులను చూసి తెలుసుకున్నట్లు తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ లాంటి మానవతావాదులు తమ ప్రభుత్వంలో ప్రజల కోసం పని చేస్తున్నారని తెలిపారు. పట్టభద్రులకు, డీఎస్సీ





అభ్యర్థులకు ఉద్యోగాల కల్పనకు మెగా డీఎస్సీ గాని, ఒక్క నోటిఫికేషన్ గానీ ఇవ్వని జగన్ రాష్ట్రం నుంచి 40 పరిశ్రమలను వెళ్ళగొట్టారన్నారు. కూటమి ప్రభుత్వంలో స్టేట్ ఇన్వెస్ట్మెంట్ బోర్డ్ సభ్యునిగా ఉన్న తన పరిశీలనలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే కూటమి ప్రభుత్వం ఆరు లక్షల 83 వేల కోట్ల పెట్టుబడులు సాధించి యువతకు 4.30 లక్షల ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీ ప్రకారం మెగా డీఎస్సీ అమలు చేసి డీఎస్సీ అభ్యర్థుల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. శాసన మండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను అత్యధిక ఓట్లు మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పైపు పగిలి వృధాగా పోతున్న త్రాగునీరు



సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్ ( శుభోదయం న్యూస్): మండలంలోని మాధవరం-1 హ్యాపీ కిడ్స్ పాఠశాల సమీపం వద్ద మంచినీటి పైపులైను డ్యామేజ్ కావడంతో త్రాగునీరు వృధాగా పోతుంది. గత రెండు నెలలు క్రితం గ్రామంలో జెసిబితో పారిశుద్ధ్య పనులు చేపడుతుండగా మంచినీటి పైపు తగిలి డ్యామేజ్ అయింది. అప్పటినుండి వృధాగా పోతున్న త్రాగునీటిని అరికట్టేందుకు పట్టించుకునే నాధుడే కరువయ్యారు. అధికారులు స్పందించి వృధాగా పోతున్న త్రాగు నీటిని అరికట్టి మరమ్మత్తు పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## బీర్కూరులో ఘనంగా హిందు హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో ఘనంగా హిందు హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు లు నిర్వహించారు. ముందుగా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కాషాయ జెండా ఎగురవేసిన అనంతరం ఛత్రపతి శివాజీ గురించి యువనాయకులు శశికాంత్ మాట్లాడుతూ తల్లి పేరు జిజియా భాయి ఆ కొడుకు పేరు శివాజీ భోంస్లే ఛత్రపతి శివాజీ మహారాజ్‌తన పదిహేడవ ఏట ప్రారంభించిన ఉద్యమంతో జీవితాంతం అలుపెరగని పోరాటాలు చేసిదాదాపుగా మొఘలుల పాలనకు స్వస్తి చెప్పి మరాఠ దేశంలో అన్ని ప్రాంతాలనూ కోటలనూ కైవసం చేసుకునిధర్మగ్లాని గావిస్తున్న వారి శిరచ్ఛేధనం చేసి ధర్మాన్ని నాలుగు పాదాలపై మోహరింపజేసి యావద్భారతావనీ జయహో ఛత్రపతి అనే విధంగా పరిపాలన సాగించి అజరామర కీర్తి ప్రతిష్టలు కైవసం చేసుకున్న మన శివాజీ మహారాజ్ జయంతి అని ఆయన అన్నారు ఈ వేడుకలు హిందువాహిని, బజరంగ్దళ్ మరియు బీర్కూరు పట్టణ యువకుల ఆధ్వర్యంలో సుమారు 200 మంది యువకులతో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం లో మియపురం శశికాంత్, కర్ణకంటి ప్రవీణ్ వడ్ల బస్వరాజు, బీరుగొండా,అశోక్,కొర్రి అనిల్ భారీ ఎత్తున యువత పాల్గొన్నారు.

## ఫుడ్ కోర్ట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం



వలిగొండ, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్) : యాదాద్రి భువనగిరి వలిగొండ పట్టణ కేంద్రంలో ఎల్లమ్మ గుడి ప్రక్కన వలిగొండ ఫుడ్ కోర్ట్ హోటల్ ని గురువారం స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ భూక్యా నాయక్, మండల, పట్టణ అధ్యక్షులు,సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, మాజీ ఎంపీపీ నూతి రమేష్,మాజీ వైస్ ఎంపీపీ బాతరాజు ఉమా బాలనర్సింహా,మాజీ మండల అధ్యక్షులు గరిసే రవి,బత్తిని లింగయ్య, పలుసం సతీష్, సత్తిరెడ్డి,సంజీవ రెడ్డి,మైసోళ్ళయాదగిరి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్, కాసుల వెంకన్న, రాములు,కొండూరు సాయి, నగేష్, ప్రశాంత్, అరుణ్,ఉదయ్,శివ,నవీన్,బాలు,చింటూ,సాయి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ రుసుమును వెంటనే చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించగలరు

### రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్ రుసు వెంటనే చెల్లించి నగర పాలక సంస్థకు సహకరించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబందించి అపరాధ రుసుం తో సహా ట్రేడ్ లైసెన్స్ రుసు%శీ% మొత్తం మార్చి లోపు చెల్లించనట్లయితే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం సదరు వ్యాపారులపై చర్య తీసుకోవడం జరుగుతుందని తెలిపారు . అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబందించి లైసెన్స్ ఫీ కూడా మార్చి 31 లోపు చెల్లించనట్లయితే ఏప్రిల్ 1, నుండి 25 శాతం పెనాల్టీ విధించడం జరుగుతుందని తెలిపారు. కొత్తగా ట్రేడ్ లైసెన్స్ పొందాలనుకున్న వారు , రెన్యువల్ చేసుకోదలచిన వారు వెబ్ సైట్ ద్వారా లేదా మీ సేవా కేంద్రాలలో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గది కొలతలు నమోదు చేసేటప్పుడు ఖచ్చితమైన వివరాలు ఇవ్వాలని అన్నారు. తప్పుడు కొలతలు నమోదు చేసినట్లు తనిఖీలో గుర్తిస్తే 25 రెట్ల పెనాల్టీ విధించడం జరుగుతుందని తెలిపారు. కొలతల్లో మార్పు అవసరమైనట్లయితే నగర పాలక సంస్థ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నగదు చెల్లింపులు లేకుండా ఆన్ లైన్ విధానం లోనే ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించాలని అన్నారు. ట్రేడ్ లైసెన్స్ కు సంబందించి వచ్చే ఫేక్ కాల్స్ కు స్పందించి మోసపోవద్దని హెచ్చరించారు . ట్రేడ్ లైసెన్స్ కు సంబందించి పూర్తి వివరాలు కావలసిన వారు నగర పాలక సంస్థ కార్యాలయంలోని పారిశుద్ధ్య విభాగంలో సంబందిత అధికారిని స్వయంగా లేదా ఫోన్ నెం . 9966626680 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

## రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ను విమర్శిస్తే ఊరుకునేది లేదు బిఆర్ఎస్ నాయకుల్లారా ఖబర్దార్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) గోదావరిఖని పట్టణంలో గురువారం రోజున స్థానిక గంగానగర్ రామగుండం ఏరియా లైన్ లారీయజమానుల సంక్షేమ సంఘం కార్యాలయంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కుందూరు శ్రీనివాస్ రెడ్డి, టిప్పర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బడికిల రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు గోదావరిఖని గంగానగర్ శివారులోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ హయాంలో లారీ ఓనర్స్ కుటుంబాలు ఉపాధి లేక రోడ్డున పడ్డాయని అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గెలిచిన తర్వాత లారీ ఓనర్స్ కుటుంబాలు మెరుగుపడ్డాయని అన్నారు. తమ ఎమ్మెల్యేపై బీఆర్ఎస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది



లేదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సామాన్యులకు అందుబాటులో బూడిద, ఇసుక రవాణా జరుగుతుందన్నారు. ఎక్కడ ఎలాంటి అక్రమ వసూళ్లకు తావు లేకుండా రవాణా జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో గ్రీన్ టాక్స్, ఫిట్ నెస్ ఖర్చులతో లారీ ఓనర్స్ ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ప్రస్తుతం స్థానికంగా ఉన్న పరిశ్రమలు ఎన్టీపీసీ, సింగరేణి, ఎరువుల కర్మాగారంలో తమ లారీలను రవాణా కోసం వినియోగిస్తున్నామన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సహకరించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నాయకులకు తెలివి లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మామిడాల చంద్రయ్య, ఇసంపల్లి రవి, అము సత్తయ్య, కరీం సతీష్, సుభాని, తానేని రమేష్, పారుపల్లి తిరుపతి, యారా అనిల్ కుమార్, మేకల రాజేందర్, మగాడి సాగర్, సిరాజ్, తదితరులు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో ముందుండి పని చేస్తాం రోగులకు పండ్ల పంపిణీ పిఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పెంద్రు డిల్కెట్






గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) సామాజిక సేవలో పిఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ముందుండి పని చేస్తామని ట్రస్ట్ అధ్యక్షుడు పెంద్రు డిల్కెట్ అన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పిఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నార్థులకు, నిరాశ్రయులకు, నిరుపేదలకు, అభాగ్యులకు సేవా కార్యక్రమాలతో అండగా నిలుస్తామని, భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు పెంద్రు డిల్కెట్, ఉపాధ్యక్షులు పెంద్రు ప్రజ్వల, ప్రధాన కార్యదర్శి మారం రాజ్ కుమార్, కోశాధికారి పెంద్రు జీవన్, కార్యనిర్వాహక సభ్యులు దాసరి బాలకృష్ణ, సలిగంటి సుమంత్, స్వచ్ఛంద కార్యకర్తలు దాసరి అరుణ, సునీత, ఆర్.హేమలత, కె.శ్యాం తదితరులున్నారు.

## విద్యార్థినిలకు మహిళల రక్షణ చట్టాల గురించి అవగాహన కార్యక్రమం అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్ రెడ్డి



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) : వర్గల్ మండలంలోని గౌరారం మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ కళాశాల మరియు స్కూల్ విద్యార్థినిలకు. ర్యాగింగ్, ఇవిటీజింగ్ పోక్సో, యాంటీహ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాలపై అవగాహన కల్పించారు గౌరారం పోలీసులు కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూచదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. కష్టపడి చదవాల్సిన వయస్సులో చెడు అలవాట్లకు బానిసలు కావద్దని కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.నూతన చట్టాలతో మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని నూతన చట్టాలలో నేరం చేసిన నేరస్తులకు కఠినమైన శిక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. మరియు బాధితులకు అండగా చట్టాలు నిలుస్తాయని మహిళలు మరియు పిల్లలు ఎవరినైనా అసభ్యకరంగా హేళనంగా మాట్లాడిన మౌనం వీడి తల్లిదండ్రులకు కానీ స్నేహితులకు కానీ చెప్పుకోవాలన్నారు లేనిపక్షంలో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు మహిళల పిల్లల రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. పిల్లలు మహిళలు ఏమైనా సమస్యలు ఇంట్లో కానీ బయట కానీ ఎదుర్కొంటే వెంటనే షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343 మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435, సమాచారం అందించాలని, సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో కీలకమని మళ్లీ ఎప్పుడు రాదని ఏం సాధించాలన్నా ఇప్పటి నుండే ప్రణాళికలు తయారు చేసుకోవాలిఅపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మరియు మాటలు నమ్మొద్దనిసోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందని అన్నారు కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ భాస్కర్ రావు, అధ్యాపకులు, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళ కానిస్టేబుల్ లావణ్య, కానిస్టేబుల్ మహేష్, భరోసా సెంటర్ సిబ్బంది హరిత, సౌమ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండండి యువత డ్రగ్స్ గంజాయికి దూరంగా ఉండండి : గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి




వర్గల్, మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) : వర్గల్ మండల కేంద్రం మరియు చౌదరిపల్లి ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు గౌరారం ఎస్సై బీ కరుణాకర్ రెడ్డి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఎన్నికలను అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దని శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని సూచించారు. ప్రజల రక్షణ మరియు సెన్సాఫ్ సెక్యూరిటీ గ సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలనీగంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని ఆన్లైన్ మోసాల బారిన ఎవరు పడవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 సైబర్ సెల్ జాతీయ ప్లైన్ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామంలో ఎవరు కూడా బెల్ట్ షాప్లు నిర్వహించ వద్దని సూచించారు.గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే మరియు ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో బీజేపీ.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్) : కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం చించోల్లి,వీరపూర్ గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం భాజపా నాయకులు జోరుగా నిర్వహిస్తున్నారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి నీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో భాజపా మండల అధ్యక్షులు నాగేళ్ళ సాయికిరణ్ నాయకులు ప్రణయ్, హన్మాండ్లు,మెట్రో సాయిలు, బాబు గొండ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీర్కూర్ మండల కాంగ్రెస్ కార్యకర్తలతో పోచారం భాస్కర్ రెడ్డి.



బీర్కూర్, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్) కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలకేంద్రంలో లో కార్యకర్తలతో సమావేశం అయిన తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బలరాజ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో మాజీ డిసిసిబి ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి.ఈ సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డి గారు మాట్లాడుతూ....బాన్సువాడ నియోజకవర్గంలోని పట్టభద్రులు ఈనెల 27 వ తేదీన జరగనున్న ఎన్నికలలో తమ అమూల్యమైన ఓటును మన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ నరేందర్ రెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండలం లోని అధిక మెజారిటీ వచ్చేలా కష్టపడలని కార్యకర్తల ను సూచించారుఈ కార్యక్రమం ఎఎంసి వైస్ ఛైర్మన్ రాములు,మాజీ ఎంపీపీ రఘు, నాయకులు,సానేపు గంగారం,ఆవారీ గంగారం,మియపురం శశికాంత్,సందీప్, కోరిమే రఘు, అరీఫ్,తదితర నాయకులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి పర్వదినాన భక్తులకు గోదావరి నీళ్లు వచ్చేనా?

భారతీయ జనతా పార్టీ పార్లమెంటు కోకన్వీనర్ గుండ బోయిన లక్ష్మణ్ యాదవ్




రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) పరమ పవిత్రమైనటువంటి ఆ పరమశివుడి యొక్క మహాశివరాత్రి ఈ నెల 26వ తేదీన ఉన్నప్పటికీ గోదావరిలో నీటి నిల్వలు ఉంచకపోవడంపై భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ కో కన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో దాదాపుగా 3 లక్షల జనాభా నిర్వహిస్తున్న ఈ ప్రాంతంలో ప్రధాన పరిశ్రమలు అయినటువంటి సింగరేణి ఎన్టీపీసీ జెన్కో లాంటి ప్రధాన పరిశ్రమలతో పాటు తలాపనే గోదావరి నది ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో నివసిస్తున్నాడని ప్రజలకు నీటి ఎద్దడి చాలా దుర్భర పరిస్థితిలో ఉంది రాబోయే వేసవి కాలనీ దృష్టిలో పెట్టుకొని కూడా స్థానిక ప్రజాప్రతినిధులు గాని అధికారులు కానీ ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడం భారతీయ జనతా పార్టీ పక్షాన నిరసన తెలియజేస్తూ ఈరోజు గోదావరి నదిలో ఫిబ్రవరి 26వ తారీకు బుధవారం రోజున హిందువులందరూ పవిత్రంగా పూజించే ఆ పరమశివుని యొక్క మహాశివరాత్రి పెద్ద పండుగ జాతర ఉంటుంది కానీ ఇప్పటికీ స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ గాని ఇన్చార్జి కమిషనర్ అయినటువంటి అరుణశ్రీ గారు గాని హిందూ భక్తులు స్నానం చేసే విధంగా కనీసం నీటినిలను ఉండే విధంగా చర్యలు తీసుకోకపోవడం చాలా విచారించదగ్గ విషయం దీనిపై వెంటనే స్థానిక ఎమ్మెల్యే స్థానిక మంత్రివర్యులు శ్రీధర్ బాబు గానీ, ఇన్చార్జి కమిషనర్ అరుణ శ్రీ స్పందించి ఎల్లంపల్లి నుండి వస్తున్నటువంటి నీటిని గేట్లు తెరిచి ఈ గోదావరి ప్రాంతం కానీ ప్రాంతంలోని భక్తులందరూ




పవిత్ర గోదావరి స్నానం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం ఈ గోదావరిఖని పారేశారు ప్రాంతంలో ఉన్నటువంటి ఇసుకను తరలించడంలో ఉన్నటువంటి శ్రద్ధ ఆర్థికంగా స్వలాభం కోసం చేసే పనుల మీద ఉన్న శ్రద్ధ రాజు ఠాకూర్ మక్కాన్ సింగ్ రామగుండం నియోజకవర్గంలోని ప్రజలు ఎంతో ప్రేమతోటి దాదాపుగా 90000 మెజార్టీ ఇచ్చారని గొప్పలు చెప్పుకునేటువంటి కాంగ్రెస్ నాయకుల్లారా మీకు ప్రజల యొక్క అవసరాలు గుర్తుకు రావడం లేదా వెంటనే ప్రజా అవసరాలను తీర్చడంలో భాగంగా మహాశివరాత్రి పర్వదినంగా గోదావరి స్నానాలు ఆచరించే హిందూ భక్తులందరికీ వెంటనే గోదావరి నదిలో నీటినిలనుంచే విధంగా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాము ఈ నిరసన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కార్పొరేషన్ ఉపాధ్యక్షులు జనగామ సాగర్, భారతీయ జనతా పార్టీ కార్పొరేషన్ యువమోర్చా అధ్యక్షులు పెద్దపల్లి భాస్కర్, హిందూ భక్తులందరూ పాల్గొనడం జరిగింది.

## ఖబడ్దార్ కౌశిక హరి..రామగుండం ఎంఎల్ఏ రాజ్ ఠాకూర్ ను విమర్శించే అర్హత నీకు లేదు

కేసోరాం సిమెంట్ పర్మనెంట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు,కన్నాల పి ఎ సి ఎస్ ఛైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) పాలకుర్తి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం రోజున ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో కార్మిక నాయకులు బయ్యపు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కి చెందిన కౌశిక హరి నిన్న పత్రిక సమావేశం లో రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారిపై చేసిన అవాస్తవ ఆరోపణలు ఖండిస్తూ వెంటనే ఆ ఆరోపణలు వెనక్కి తీసుకుని బేషరతుగా ఎంఎల్ఏ గారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రామగుండం నియోజక వర్గాన్ని చిత్తశుద్ధితో అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రాజ్ ఠాకూర్ గారిని రాజకీయ లబ్ధికోసం నిందిస్తే కాంగ్రెస్ శ్రేణులు ,ప్రజలు తగిన గుణపాఠం చెప్తారు అని హితవు పలికారు ఇట్టి కార్యక్రమంలో పాలకుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్, పాలకుర్తి మాజీ సర్పంచ్ , కేశోరాం పర్మనెంట్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేణి శ్రీనివాస్ ,పర్మనెంట్ యూనియన్ జనరల్ సెక్రటరీ దాడి మహేష్ ,మంచినీళ్ళ భాస్కర్,అమ్ముల కుమారస్వామి మరియు పయ్యావుల శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అమీన్పూర్ మున్సిపాలిటీ పటేల్ గూడా కిష్టారెడ్డిపేట్ గ్రామాల పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



అమీన్పూర్ : (శుభోదయం న్యూస్)సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు నియోజవర్గం అమీన్పూర్ మున్సిపాలిటీ పటేల్ గూడా కిష్టారెడ్డిపేట్ గ్రామాల పరిధిలో గల విఆర్సి హెూమ్స్ కాలనీలో భ్రమరాంబిక మల్లికార్జున కాలనీలో రెయిన్బో మెడల్స్ కాలనీలలో అమీన్పూర్ మండల్ ఇన్చార్జి హైదరాబాద్ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి దిశా కమిటీ నెంబర్ శారద మల్లేష్ గారి తో కలసి అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో మెదక్ కరీంనగర్ అదిలాబాద్ నిజాంబాద్ భారతీయ జనతా పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్న మైల్ అంజి రెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు ఒకటో నెంబర్ కు 1 ఒకటి అని అంక్యతో ఓటు వేయాలని పట్టబద్రుల ఇంటింటికి వెళ్లి ఓటు వేయాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల సభ్యులు గంగుల అంజిరెడ్డి,బిజెపి నాయకులు చీమలదారి శ్రీహరి,సముద్రాల రాకేష్.శ్రీనివాస్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,ముత్యాల వెంకటేష్,గులకుంట యాదగిరి,రాజేందర్ గౌడ్,సందీప్, నాగేంద్రబాబు, రత్నం,బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అమీన్పూర్ మండలం పటేల్ గూడా గ్రామపంచాయతీ భవనం పక్కన ఉన్న రోడ్డును మరమ్మతులు చేయించిన ఈర్ల రాజ్ రాజ్ ముదిరాజ్



అమీన్పూర్ : (శుభోదయం న్యూస్)పటాన్చెరువు నియోజవర్గం అమీన్పూర్ మండలం పటేల్ గూడ మున్సిపల్ ప్రజలకు కాలనీలా ప్రజలందరికీ గత కొన్ని సంవత్సరాలుగా పటేల్ గూడా మున్సిపల్ భవనం పక్కన రోడ్డు సమస్యను మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు గారి దృష్టికి అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ తీసుకువెళ్లడం జరిగింది. ఈ సమస్య పరిష్కరించాలని కొన్ని రోజుల ముందు పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ఈ యొక్క రోడ్డును పరిశీలించి ఈ రోడ్డుపైన పర్యటన చేసి గ్రామ ప్రజల అభిప్రాయాన్ని తీసుకొని వెంటనే పటాన్చెరు శాసనసభ్యులు మహిపాల్ రెడ్డితో మరియు చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తో అమీన్పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డితో మాట్లాడి ఈ రోడ్డుకు సుమారుగా అక్షరాల 35 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించారు అని అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ తెలియజేశారు. అందులో భాగంగా గత నెల క్రితం రోడ్డుకు శిలాఫలకం పటాన్చెరు శాసనసభ్యులు మైపాల్ రెడ్డి వేయడం జరిగింది. ఈ యొక్క పటేల్ గూడ మున్సిపల్



పక్కన ఉన్నటు వంటి రోడ్డును మొదలుపెట్టడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ యొక్క రోడ్డు పనులకు సహకరించిన మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావుకి మన పటాన్చెరు శాసనసభ్యులు మహిపాల్ రెడ్డికి అమీన్పూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డికి అమీన్పూర్ మున్సిపల్ ఉన్నత అధికారులకు మా పటేల్ గూడా మున్సిపల్ ప్రజల తరపున కాలనీలా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం ఈ కార్యక్రమంలోఈర్ల రాజు ముదిరాజ్,అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు,బిజెపి నాయకులు పన్యాల శ్రీనివాస్ రెడ్డి,సముద్రాల రాకేష్,నల్లగోని రాజ్ కుమార్ గౌడ్, ఈర్ల వెంకటేష్ ముదిరాజ్, పన్యాల కృష్ణా గౌడ్, నిమ్మల శ్రీధర్ రెడ్డి, ముత్యాల వెంకటేష్, వీరాంజనేయులు, రంజిత్, బొమ్మ రెడ్డి, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండల కేంద్రంలో గ్రాడ్యుయేట్ మరియు ఉపాధ్యాయుల సమావేశం





పటాన్చెరు : (శుభోదయం న్యూస్)గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల కేంద్రంలో గ్రాడ్యుయేట్ మరియు ఉపాధ్యాయల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్,మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి హాజరయ్యారు.సంగారెడ్డి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖరరెడ్డి, వట్పల్లి మండల బీజేపీ అధ్యక్షుడు అశోక్, మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిన్నారం మండల కేంద్రంలో జోరుగా బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



జిన్నారం : (శుభోదయం న్యూస్)సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం జిన్నారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం బీజేపీ పార్టీ నాయకులు నిర్వహించారు. గురువారం ఉదయం సంగారెడ్డి జిల్లా బీజేపీ పార్టీ ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పట్టభద్రులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల అభివృద్ధి పీఎం నరేంద్ర మోడీ తోనే సాధ్యమవుతుందని అన్నారు. బిజెపి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు శ్రీనివాస్, రమేష్, పట్టభద్రులు, వే టు న్యూస్ సీనియర్ జర్నలిస్ట్ ప్రవీణ్ కుమార్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మూడు వందల సిమెంటు బస్తాలను అందజేసిన పులిగిల్ల ప్రకాశం చారి



జిన్నారం : (శుభోదయం న్యూస్)జిన్నారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మూడు వందల బస్తాల సిమెంట్ ను గడ్డపోతారం మాజీ సర్పంచ్ పిలిగిల్ల ప్రకాశం చారి గారు అందజేశారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశం గౌడ్,భోజి రెడ్డి,నర్సింహా రెడ్డి,మంద రమేష్,ఏర్పుల లింగం,నర్సింగ్ రావు,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడాకారులకు టీ షర్టు పంపిణీ చేసిన సింగాపురం మాజీ సర్పంచ్ లచ్చయ్య




శుభోదయం ప్రతినిధి శంకర్ పల్లి: ఫిబ్రవరి 20: వికారాబాద్ జిల్లా కేంద్రంలో 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కాబట్టి అసోసియేషన్ తరపున శంకర్‌పల్లి మున్సిపాల్టీ సింగాపురం వార్డుకు చెందిన మాజీ సర్పంచ్ లచ్చయ్య కుమారుడు ప్రతాప్, పార్టీ గ్రామ మాజీ సర్పంచ్ మున్నూరు లక్ష్మణ్ లు కలిసి గురువారం సంగారెడ్డి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు జెర్సీ టీ షర్టులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడాకారులను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులు కబడ్డీ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రోళ్ల శివకుమార్, రుద్రారం శ్రీధర్, చాకలి నరసింహ, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా అధ్యక్షులు ముక్తార్ జానీ, ఆర్గనైజ్ సెక్రటరీ శివయ్య, క్రీడాకారులు నారాయణ, నవీన్, సురేష్, గౌతమ్, సంతోష్, సందీప్, అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ మహిళా కాంగ్రెస్ దేశంలోనే టాప్: రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు

### సంబరాల్లో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్




శుభోదయం ప్రతినిధి/ రంగారెడ్డి జిల్లా:రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ సభ్యత్వాలు లక్షకు పైగా రావడం, దేశంలోనే సభ్యత్వాలో తెలంగాణ మహిళా కాంగ్రెస్ మొదటి స్థానంలో నిలిచిందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో సంబరాలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సునీత రావు మాట్లాడుతూ దేశంలోనే సభ్యత్వాలో అగ్రగామిగా తెలంగాణ మహిళా కాంగ్రెస్ నిలిచిందని తెలిపారు.ఇది తన విజయం కాదని, సభ్యత్వాలు చేసిన ప్రతి ఒక్క అక్క, చెల్లెల విజయమని చెప్పారు. ఈ మెంబర్షిప్ ల వెనుక అందరి కష్టం ఉందన్నారు. నేడు అన్ని రాష్ట్రాల కంటే పై స్థానంలో తెలంగాణ మహిళా కాంగ్రెస్ నిలబడిందని హర్షం వ్యక్తం చేశారు. ఇక లక్ష సభ్యత్వాలు దాటిన సందర్భంగా సంబరాలు అంబరాన్ని అంటే విధంగా డప్పు వాయిద్యాలతో, బాణాసంచా కాల్చి, నృత్యాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మొదటి ప్రాధాన్యత ఓటును పేరా బత్తులకే వేయండి ఉప సర్పంచ్ కిషోర్

గోకవరం,: ఇటీవల జరగనున్న పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల దగ్గరలో పడటంతో గోకవరం మండలంలో టిడిపి నాయకులు ఎన్నికల ప్రచారం రూపం అందుకుంది ఇందులో భాగంగా గురువారం కృష్ణపాలెం గ్రామంలో ఎంపీపీ యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ను, గ్రామ సచివాలయ ఉద్యోగులను ఉప సర్పంచ్ కిషోర్ గ్రాడ్యుయేట్ వద్దకు వెళ్లి టిడిపి నాయకులు ఓటును అభ్యర్థించారు ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ కూటమి సభ్యులు బలపరిచిన అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖర్ ఓటు వేసి (1) అంకెను మీ ఓటు వేసి ఆయన విజయానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు రాష్ట్రం శాశ్వత అభివృద్ధి కావాలంటే కూటమి సభ్యులకి నియమించిన అభ్యర్థికే ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు స్థానిక ఎమ్మెల్యే నెహ్రూ వెనక పట్టభద్రులు అందరూ ఉన్నారని ఆయన వివరించారు ఈ కార్యక్రమంలో జగ్గంపేట సమన్వయ కమిటీ సభ్యులు మండిగ గంగాధర్, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బంగారు రాజు, కృష్ణపాలెం టిడిపి సమన్వయ కమిటీ అధ్యక్షులు సిద్ధ సురేష్ తదితరులు పాల్గొన్నారు

## ఈ రహదారులపై ప్రయాణాలు... ప్రాణసంకటం.

గడివేముల : నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గ గడివేముల మండల పరిధిలోని కొర్రపోలురు,సోమాపురం రహదారులపై ప్రయాణాలు కొనసాగించడానికి వాహనదారులు మరియు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.వివరాల్లోకి వెళితే...గడివేముల నుండి రేగడగూడూరు,వెలుగోడు మరియు ఆత్మకూరు గ్రామాలకు వెళ్ళు ప్రధాన రహదారి మార్గ మధ్యలోని కొర్రపోలురు,సోమాపురం గ్రామాలకు వెళ్ళు రహదారి పూర్తిగా దెబ్బతిని రహదారిపై వేసిన తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని,కంకరరాళ్లు బయటపడి గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నారు. అంతేకాకుండా కొర్రపోలురు నుండి రేగడగూడూరు వెళ్ళు రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలో ప్రయాణాలు కొనసాగిస్తున్న వాహనదారులు గుంతలో పడి కాళ్లు చేతులు విరగొట్టుకొని ఆసుపత్రుల పాలవుతున్న సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు మాత్రం రహదారి మధ్యలో ఏర్పడిన గుంతను పూడ్చి వేయకుండా చూసి చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.....రహదారులపై ఏర్పడిన గుంతలపై కొర్రపోలురు గ్రామ సర్పంచ్ మాలిక్ భాష మాట్లాడుతూ కొర్రపోలురు గ్రామం నుండి రేగడగూడూరుకు వెళ్ళు ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంత రాత్రి సమయంలో వాహనదారులకు కనపడక గుంతలో పడి కాళ్ళు చేతులు విరగ్గొట్టుకొని ఆస్పత్రుల పాలవుతున్నారని మరియు గడివేముల నుండి కోర్రపోలూరు సోమాపురం గ్రామాలకు వెళ్ళు రహదారిలో ఏర్పడిన గుంతలను సంబంధిత ఆర్అండ్బి అధికారులు పూడ్చివేసి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని కొర్రపోలురు గ్రామ సర్పంచ్ మాలిక్ భాష, కొర్రపోలూరు,సోమాపురం గ్రామ ప్రజలు మరియు వాహనదారులు ఆర్అండ్బి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## దోమల మందు కొట్టించుచున్న సర్పంచ్ కడిమి. చిన్నవరాజు

అమలాపురర్):అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తం మండలం ఉప్పలగుప్తం గ్రామపంచాయతీలో ఉన్న ప్రతి గ్రామానికి దోమలు ఎక్కువగా ఉండడం వల్ల దోమల నివారణకు దోమల మందు పొగ స్ప్రే చేయిస్తున్న సర్పంచ్ మరియు సర్పంచుసమైక్య మండల అధ్యక్షులు కడిమి చిన్నవరాజు.

## గర్భిణీ స్త్రీలను గుర్తించి, సుఖ ప్రసవం జరిగేలా చర్యలు చేపట్టాలి.

### నెల్లూరు డి ఎం హెచ్ వో డాక్టర్ వి.సుజాత.

నెల్లూరు( ప్రభ న్యూస్):నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి. సుజాత అధ్యక్షతన శిశు మరణాల సబ్ కమిటీ సమీక్ష సమావేశము జరిగినది. జిల్లాలో2024 గత నవంబర్, డిసెంబర్ నెలలలో సంభవించిన 9 శిశు మరణాలకు గల కారణాలు మరియు లోపాలు గురించి క్షుణ్ణముగా సమీక్ష జరిగినది.ఈ సందర్భముగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వి. సుజాత మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీని గుర్తించి త్వరితగతిన నమోదు చేయాలని, అన్నీ రకాల పరీక్షలు తప్పని సరిగా చేయాలని మరియు హై రిస్క్ గర్భిణీ స్త్రీల ను గుర్తించి సదరు గర్భిణీ స్త్రీలకు ఎటువంటి ఆటంకము లేకుండా సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించి ప్రభుత్వ ఆసుపత్రి లో సుఖ ప్రసవము జరిగే వరకు సంబంధిత ఆరోగ్య పర్యవేక్షకురాలుకు పూర్తి భాధ్యత అప్పగించవలసిందిగా, పిల్లలకు తప్పనిసరిగా తల్లి పాలు ఇచ్చేలాగా, పుట్టిన పిల్లలందరికి 0 డోసు 24 గంటలలో ఇవ్వాలని, ఐదు సంవత్సరముల లోపు పిల్లలందరికి వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని మరియు పిల్లలకు రక్తహీనత లేకుండా ఐరన్ సిరప్/మాత్రలు తప్పని సరిగా ఇచ్చేలాగా పర్యవేక్షించవల్సిందిగా వైద్యాధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు జరిగేలాగా ముందస్తు ప్రణాళిక రూపొందించు కోవాలని, అర్హులైన ప్రతి గర్భిణీ స్త్రీకి మరియు బాలింతకు జె ఎస్ వై అండ్ జె ఎస్ ఎస్ కె పథకాలు క్రింద లబ్ధి చేకూరేలాగా చూడాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి. సుజాత ఆదేశించారు. ఏ తల్లి, బిడ్డ కూడా రక్తహీనత వలన, సకాలములో వైద్య సేవలు అందక మరణించినట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత వైద్య ఆరోగ్య సిబ్బంది పైన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని డిఎం అండ్ హెచ్ వో డాక్టర్ వి. సుజాత హెచ్చరించారు.ఈ కమిటీ సమీక్ష సమావేశంలో డి ఎల్ ఏ టి ఓ డా షేక్ ఖాదర్ వలి డి ఐ ఓ డా ఏ ఉమామహేశ్వరి, పిఓ (ఎఫ్ పి సి) డా పి ఎల్ దయాకర్, డిప్యూటీ డి ఏం హెచ్ ఓ లు డా పి బ్రిజిత, డా ఎస్ రజని, అసిస్టెంట్ ప్రొఫెసర్ (పీడియాట్రిక్ ) జిజిహెచ్ డా%××%జి గ్రేస్ ఎస్తేర్, డా శ్రవణ్ కుమార్, డెమో కె. కనకరత్నం, డిపిహెచ్ఎన్ఓ శ్రీమతి జి మంజుల, ఎస్ఓ శ్రీమతి కె సహన, సంబంధిత వైద్యాధికారులు మరియు ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా ఆధ్వర్యంలో బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్ కోర్సులపై శిక్షణ.

### ముఖ్య అతిథిగా పాల్గొన్న మెప్మా పీడీ రాధమ్మ.

నెల్లూరు ప్రతినిధి.( ప్రభ న్యూస్):నెల్లూరు నగరపాలక సంస్థలో సర్వీస్ ప్రొవైడర్ లకి జీవనోపాధి కల్పించుటలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో బ్యూటిసియన్ లకి ,ఎలక్ట్రిషన్లకి 15 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం నెల్లూరు నగరంలోని స్థానిక హరినాధపురంలో యూత్ ఆఫ్ టర్మ్ వారి ద్వారా ప్రారంభం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ.రాధమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బ్యూటీసీయన్ లకి మంచి డిమాండ్ ఉందన్నారు. బ్యూటీషియన్ కోర్స్ పై మక్కువ కలిగిన వాళు ఇష్టపడి చక్కగా శిక్షణ పొందాలని,ఈ ట్రైనింగ్ నేర్చుకున్న తరువాత మెప్మా ద్వారా ఒక సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.హెూం ట్రయాంగిల్ యాప్ తో మెప్మా స్టేట్ లెవెల్ టై - అప్ అయిందని దానికి శిక్షణ పొందిన వారి పేర్లు ఆన్ బోర్డు చేస్తారని, మరల మీకు ఆప్ గురించి 8 గంటలపాటు ట్రైనింగ్ ఇస్తారన్నారు. తరువాత మీకు వర్క్ అల్లోట్మెంట్ మెసేజెస్ రావడం ద్వారా మీకు జీవనోపాధి కల్పించడం జరుగుతుందన్నారు. కాబట్టి ప్రస్తుతం ఇక్కడ శిక్షణ పొందుతున్న ఎలక్ట్రీషియన్ లు , బ్యూటీజియన్ ఈ యాప్ ద్వారా అలెర్ట్ మెసేజ్ రావడం ద్వారా ఎవరైతే కస్టమర్ వర్క్ రిక్వెస్ట్ పెట్టారో, వారికి వీరిని ఆ వర్క్ కి అలోట్మెంట్ చేయడం జరుగుతుందిని చెప్పారు. తద్వారా నెలకి 30,000 నుండి 40,000 వరకు ఆదాయం పొందవచ్చునన్నారు. మెప్మా మిషన్ డైరెక్టర్ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేస్తున్నారు గనుక అందరు తప్పనిసరిగా రోజు శిక్షణకి హాజరయ్యి లబ్ధి పొందాలని కోరారు.బ్యూటీషియన్ కోర్స్ 2 బ్యాచ్ లు ,ఎలక్ట్రీషియన్ ఒక బ్యాచ్ ను ప్రారంభించడం జరిగిందని గురువారం ఒక ప్రకటనలో మెప్మా వీడి రాధమ్మ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీ ఈ లు ,సిఎంఎంలు తదితరులు పాల్గొన్నారు

## సూర్య ఘర్, ముక్తి బిజిలి పథకంలో వినియోగదారులు 1 మీటర్కు మాత్రమే చెల్లించాలి.

నెల్లూరు.:(విద్యుత్ భవన్ యోజన పథకంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ ,ముఫ్తీ బిజిలీ యోజన పథకంలో వినియోగదారులు విద్యుత్ శాఖకు చెల్లించవలసింది ఒక్క మీటర్ కు మాత్రమే అని తెలిపారు. సింగల్ ఫేస్ మీటర్(4 కిలో వాట్స్ వరకు )కు అయితే రూ 3,600/-, త్రీ ఫేస్ మీటర్ కు(14 కిలో వాట్స్ వరకు )అయితే రూ. 5,605 /- మరియు సి.టి. మీటర్ కు( 15 కిలో వాట్స్ నుండి 37.5 కిలో వాట్స్ వరకు )అయితే రూ 8,306/- మాత్రమే చెల్లించాలని తెలిపారు. ఈ మీటర్ ఖర్చులు మాత్రమే విద్యుత్ సంస్థ మీరు చెల్లించవలసినదని తెలిపారు.వినియోగదారుడు సోలార్ విద్యుత్ కొరకు వెబ్ సైట్ లో నమోదు చేసుకున్న తరువాత వెండర్ సెలక్షన్ ఉంటుందన్నారు.ఎంత మంది వెండర్స్ ఉన్నారో వారి అందరి లిస్ట్ వవెండర్ సెలక్షన్ అయిన తరువాత వెండర్ మీకు సోలార్ పలకలు మరియు సామాగ్రి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ మొత్తం ప్రక్రియలో విద్యుత్ సంస్థకు ఎటువంటి సంబంధం ఉండదన్నారు.మరియు మా సంస్థ అధికారులు కాని,సిబ్బంది కాని ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని ఎటువంటి సంబంధం ఉండదన్నారు. మొత్తం ప్రక్రియ వెండర్ మరియు వినియిగాదారునికి మాత్రమే సంబందించినదని తెలిపారు.ఈ ప్రక్రియ అయినా తరువాత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లాగిన్ కు వెలుతుందన్నారు.డిప్యూటీ ఇంజనీర్ స్వయంగా వచ్చి ఇన్స్పెక్షన్ చేస్తారు. ఈ ఇన్స్పెక్షన్ టైంలో వినియోగదారుడు ఇండియాలో తయారైన ప్యానెల్స్ వాడుతున్నారా లేదా లైటనింగ్ ఎరస్టర్ (పిడుగులు పడినప్పుడు సోలార్ ప్యానెల్స్ దెబ్బతినకుండా ) ఏర్పాటు చేసుకున్నారా లేదా అని, 3 ఎర్త్ పైపులు బిగించారా లేదా అని తనిఖీ అచేసి రిపోర్ట్ ఇవ్వడం జరుగుతుంది. తరువాత వినియోగదారునికి మీటర్ బిగించడం జరుగుతుందన్నారు. ఈ మీటర్ కు అయ్యే ఖర్చు మాత్రమే వినియోగదారుడు విద్యుత్ సంస్థ కు చెల్లించవలసి ఉంటుందన్నారు.వినియోగదారుడు వేండర్ డబ్బులు చెల్లించిన తరువాత మీటర్ కు మాత్రమే డబ్బులు చెల్లించాలి మిగతా ఎక్కడ డబ్బులు చెల్లించనవసరం లేదు.తర్వాత వెంటనే సబ్సిడీకి అప్లై చేసుకోవచ్చు సబ్సిడీ ఏడు రోజుల నుంచి 15 రోజుల లోపల మీ బ్యాంక్ అకౌంట్లో జమ చేయడం జరుగుతుంది.1 కిలోవాట్ సోలార్ కావాల్సిన వాళ్ళు 70, 000 వేల నుండి 80,000 వరకు ఖర్చవుతుంది అని, 2 కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ కావాల్సిన వారు 1,30,000 నుండి 1,40,000 వరకు చెల్లించవలసి ఉంటుంది, 3 కిలోవాట్ సామర్థ్యం గల వాటికి 2,10,000 నుండి నుంచి 2,20,000 వరకు ఖర్చు అవుతుంది అని ఈ డబ్బులు కట్టిన తర్వాత వినియోగదారుడు మీటర్ చార్జెస్ మాత్రమే కట్టవలెను. ఇక ఎవ్వరికి డబ్బులు చెల్లించనవసరం లేదు. డబ్బులు ఎక్కువ చెల్లించమని ఎవరైనా అడిగినచో వినియోగదారుడు చెల్లించిన అవసరం లేదు.కాబట్టి ప్రతి ఒక్కరు సోలార్ వైపు అడుగులు వేయాలని తెలియచేశారు.

## గ్రూప్ టు మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలి.

నెల్లూరుజిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపిపిఎస్సి) గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాలులో గ్రూప్-2 పరీక్షల కోఆర్డినేషన్ అధికారి, కందుకూరు సబ్ కలెక్టర్ టి శ్రీపూజ, డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావుతో కలిసి పరీక్షల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 23న జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని వి.ఆర్. పిజి స్టడీస్, నెల్లూరు ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, వెంకటాచలం సమీపంలోని క్యూబా ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరు అపోలో హాస్పిటల్ సమీపంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, కలివెలపాలెం, ధనలక్ష్మీపురంలోని నారాయణ ఇంగ్లీషుమీడియం స్కూల్, నెల్లూరు రామలింగాపురంలోని జగన్స్ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడు పరీక్షా కేంద్రాలకు ఏడుగురు లయజనింగ్ అధికారులను నియమించినట్లు చెప్పారు. మొత్తం 4102 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన చెప్పారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఒపి) ప్రకారం పరీక్షలను పక్కాగా నిర్వహించాలన్నారు. పరీక్షల సమన్వయ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, సిసి కెమెరాల ఏర్పాటు మొదల్కెన మౌలిక వసతులు, భద్రతాల చర్యలు సక్రమంగా ఉండేలా పరీక్షా కేంద్రాలను వ్యక్తిగతంగా పరిశీలించాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలో కూడా సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జెరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు తెరుచుకోకుండా 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సెల్‌ఫోన్లను పరీక్షా కేంద్రంలోని డిపాజిట్ కేంద్రంలో డిపాజిట్ చేయాలన్నారు. ప్రతిఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ముందస్తు చర్యలు చేపట్టి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం పరీక్షల కోఆర్డినేటింగ్ అధికారి టి.శ్రీపూజ పరీక్షలకు సంబంధించి సాంకేతికపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇన్విజిలెటర్లకు ముందుగా అన్ని సూచనలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సి అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణవేణి, సెక్షన్ అధికారులు అంజన, ఆర్.వి.రమణ, పరీక్షల లయజనింగ్ అధికారులు శ్రీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## క్రిష్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షురాలు ఈద సంధ్య కుసత్కారం

అమలాపురం: డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వై సి పి క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నికైన యాద సంధ్య ను మైనారిటి క్రిష్టియన్ సంఘాల నాయకులు గురువారం కలసి శుభాకాంక్షలు తెలియజేసారు అమలాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు మరియు గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుంచే రమణారావు సంధ్యను ఘనంగా సన్మానించారు.

## వాసుపల్లి ని కలిసిన “మక్సూద్ అహ్మద్”

### కక్ష రాజకీయాలు కాదు..ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి!

విశాఖపట్నం దక్షి):ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జహీర్ అహ్మద్ కుమారుడు మక్సూద్ అహ్మద్ వైయస్సార్సీపి జిల్లా సెక్రెటరీగా నియమితులైన సందర్భంగా దక్షణ నియోజకవర్గం సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఉదయం ఆసీలమెట్ట కార్యాలయంలో వాసుపల్లి ని కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి సరికొత్తగా మంచి వ్యక్తులను వైఎస్ఆర్సిపి పార్టీకి కృషిచేస్తున్న నేతలను ఎంపిక చేసి వారికి పార్టీ సముచిత స్థానం కల్పించడం ఆనందదాయకమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ వర్గానికి కూడా ఇప్పటివరకు న్యాయం చేయలేకపోగా, వారి ఇచ్చిన సూపర్ సిక్స్ లాంటి ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారన్నారు. పైగా జగన్మోహన్ రెడ్డి పేదలకి, మధ్యతరగతి ప్రజలందరికీ అనేక సంక్షేమ పథకాల అందించి, విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తూ అనేక ఆసుపత్రి నిర్మాణాలు యూనివర్సిటీలు నెలకొల్పారన్నారు. వాటన్నిటిని తుంగలో తొక్కుతూ ప్రజలను పక్కదోవ పట్టించేందుకు కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఆయన ఎంతో దృఢ సంకల్పంతో ఉన్నారని, గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ సరికొత్తగా పార్టీని ముందుకు తీసుకువెళుతున్నారని అన్నారు. ప్రజలకు సేవ చేసే డాక్టర్ జహీర్ అహ్మద్ లాంటి మంచి వ్యక్తులతో పార్టీకి పూర్వవైభం వస్తుందని వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, 42 వార్డ్ అధ్యక్షులు భీశెట్టి ప్రసాద్, సాగర్, అజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## పిసా చట్టం పై అందరూ అవగాహన కలిగి ఉండాలి

అరకులోయ్):అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం గన్నెల పంచాయతీ నూతనంగా ఎన్నుకోబడిన పిసా సభ్యులకు వార్డ్ మెంబర్లకు బుధవారము మండల సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు అరకులోయ ఎంపీడీవో లో వరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గన్నెల సర్పంచ్ బీబీ బొజ్జ ఎంపీటీసీ బా రికి లలిత పాల్గొని మాట్లాడుతూక్లస్టర్ పరిధిలో గల సమస్యల పరిష్కారానికి మీరంతా ప్రజలకు ఎంతో ధైర్యంగా నిలవాలని సూచించారు.పేసా కమిటీలకు ఆర్థిక నిధులు కూడా మంజూరు అవుతాయని వాటిని క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించాలని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఈ చట్టాన్ని మీరందరూ కలిసికట్టుగా పటిష్టవంతంగా ముందుకు నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా సభ్యులకి స్థానిక పరిపాలనను బలపరచడం మరియు షెడ్యూల్ ప్రాంతాలలో సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించే దిశగా చట్టం అమలు పద్ధతులపై మాట్లాడారు.కేరళ, లడక్ మరియు మణిపూర్ వంటి ఆదివాసి ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు తెలియజేస్తూ, మన అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని అవగాహన కల్పించారు. షెడ్యూల్ ప్రాంతాల్లో గ్రామ సభల హక్కులు మరియు బాధ్యతలు,వనరుల నిర్వహణ, సమస్యల పరిష్కారం మరియు నిర్ణయాల ప్రక్రియలో పేసా కమిటీల పాత్ర,గిరిజనుల హక్కుల పరిరక్షణ మరియు స్వయం పాలనకు మద్దతు,సంక్షేమ పథకాల అమలు, పై క్లుప్తంగా వివరించారుఈ శిక్షణ కార్యక్రమంలో గన్నెల పంచాయితీ సెక్రెటరీ జ్యోతి సచివాలయ సిబ్బంది డిజిటల్ అసిస్టెంట్ సో న్నాయి కృష్ణ ద్వాక్రా సంఘాల మహిళలు పేసా క్లస్టర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## చోడవరంలో కారునీ ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

చోడవరర్):చోడవరం నుంచి అనకాపల్లి వెళ్లే దారిలో గజపతినగరం సమీపంలో గురువారం ఆర్టిసి బస్సు ఒక కారును ఢీకొట్టింది. అయితే అదృష్టవసత్తు ఎవరికి గాయలవలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి పరిశీలించారు. వివరాలు పరిశీలిస్తే.. చోడవరం నుంచి చిట్టు, తవుడుతో వెళ్తున్న లోడువ్యాన్ లో నుంచి తౌడు బస్తా కింద పడింది. వెనక వెళ్తున్న ఆటో డ్రైవర్ బస్తా పడిపోవడంతో ఆగడంతో వెనక వస్తున్న మరో రెండు కార్లు కూడా ఆగి ఉన్నాయి. అందులో ఒక కారులో పెళ్లికూతురుని తీసుకెళ్తున్న వెహికల్ తో పాటు మరో కారు ఉన్నాయి. అయితే వెలుగు వస్తున్న ఆర్టీసీ బస్సు చివరలొ అగిఉన్న కారును ఢీ కొట్టడంతో ఆ కారుతోపాటు ముందునున్న మరో కారు కూడా ప్రమాదానికి గురయ్యాయి .రెండు కారులు కూడా బాగా దెబ్బతిన్నాయి. అయినప్పటికీ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని తగు చర్యలు చేపట్టారు. కాగా ఈ ప్రమాదం వల్ల సుమారు గంటసేపు బి.ఎన్ రోడ్డులో రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

# ఎన్నికల ప్రచారంలో ఆత్మహత్య చేసుకుంటానని కౌశిక్ రెడ్డి బెదిరించిన కేసు.. విచారణ వాయిదా

**అసెంబ్లీ ఎన్నికల సమయంలో బెదిరించారంటూ నోడల్ అధికారి ఫిర్యాదు**

**పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన కమలాపూర్ పోలీసులు**

**కేసు కొట్టి వేయాలంటూ కౌశిక్ రెడ్డి పిటిషన్**




**హైదరాబాద్, :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలంటూ కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ జరిపిన హైకోర్టు తదుపరి విచారణను మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హుజూరాబాద్‌లో ప్రచారం సందర్భంగా ఆత్మహత్య చేసుకుంటానని కౌశిక్ రెడ్డి బెదిరించాడని కేసు నమోదైంది. కమలాపూర్ నోడల్ అధికారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రచారంలో ఆత్మహత్య చేసుకుంటానని కౌశిక్ రెడ్డి బెదిరింపులకు పాల్పడ్డారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. నోడల్ అధికారి ఫిర్యాదుతో పలు సెక్షన్ల కింద కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో కేసు విచారణలో ఉంది. ఈ కేసును కొట్టి వేయాలంటూ కౌశిక్ రెడ్డి గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ జరిపిన హైకోర్టు, తదుపరి విచారణను వాయిదా వేసింది.

**బండి సంజయ్‌పై నమోదైన కేసును కొట్టివేసిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై నమోదైన కేసును నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో బండి సంజయ్?పై కేసు నమోదైంది. బీఆర్ఎస్‌ను దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చారంటూ ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు కేసును కొట్టివేసింది.

# టీటీడీ ఉద్యోగ సంఘాలతో బోర్డు సభ్యుల చర్చలు విఫలం



తిరుపతి: టీటీడీ ఉద్యోగుల నిరసన నేపథ్యంలో టీటీడీ ఉద్యోగ సంఘాల నాయకులతో టీటీడీ అడిషనల్ ఈవో, జేఈవో చర్చలు జరిపారు. ఆందోళన విరమించాలని టీటీడీ సభ్యులు కోరారు. పాలక మండలి సభ్యుడు నరేష్‌ను తొలగించే వరకు ఆందోళన విరమించేది లేదని ఉద్యోగులు తేల్చి చెప్పారు. ఉద్యోగిని దూషించినందుకు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని.. టీటీడీ ఉద్యోగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రేపటి నుంచి 48 గంటలపాటు మౌన నిరసన చేయాలని ఉద్యోగ సంఘాలు నిర్ణయించాయి. టీటీడీ ఉద్యోగ సంఘాలతో బోర్డు సభ్యుల చర్చలు విఫలమయ్యాయి. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని టీటీడీ ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక హెచ్చరించింది.

# జగన్ వస్తే.. కూటమి సర్కార్‌కు ఎందుకంత కంగారు




తూర్పుగోదావరి: వైఎస్ జగన్ గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లడంతో కూటమి సర్కార్‌కు కంగారు పుట్టిందని.. ప్రభుత్వం నిద్రావస్థలో ఉంటే ప్రతిపక్షం సమస్యను ప్రజలకు చూపించాలి.. వైఎస్ జగన్ అదే పని చేశారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులు, రైతు కూలీలను చంద్రబాబు ప్రభుత్వం మోసగిస్తుందన్నారు. గుంటూరు మిర్చి రైతుల విషయంలో సీఎం బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. "మిర్చి రైతుకు సరైన ధర లభించలేదని.. ఒప్పుకుంటూ గిట్టుబాటు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మాజీ ముఖ్యమంత్రికి అవసరమైన భద్రతను ప్రభుత్వం ఎందుకు కల్పించలేకపోయింది?. ప్రభుత్వం ఇప్పటి వరకు గిట్టుబాటు ధర నిర్ణయించలేదని మంత్రులు చెప్పడం విడ్డూరం. రైతు నష్టపోతున్నా గిట్టుబాటు ధర ప్రకటించకపోవడం దారుణం. క్వింటాల్ తర్వాత 11 వేల 600 చొప్పున కొనుగోలు చేయాలని ఉద్యానవన శాఖ రిపోర్ట్ ఇచ్చింది. మార్కెట్ ఇంటర్వెన్షన్ లేకుండా రిపోర్టును పక్కన పడేశారు. తీవ్రమైన అసత్య ప్రచారానికి ఒడిగడుతున్నారు" అని వేణు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఓ చిన్నారి వైఎస్ జగన్‌తో సెల్ఫీ తీయించుకోవటానికి ప్రయత్నిస్తే ఐటీడీపీ దారుణంగా ట్రోల్ చేసింది. విమర్శలు, ప్రతిపక్షాల నోరు నొక్కడం ద్వారా పాలన కొనసాగించాలనుకోవడం కరెక్ట్ కాదు. ప్రతి పక్ష నేత సమస్యలను పరిశీలించడానికి వెళ్ళినా కేసు పెట్టాలని నిర్ణయం తీసుకోవడం దారుణం" అని వేణుగోపాలకృష్ణ ధ్వజమెత్తారు.

# మీ ఇష్టానుసారం ప్రవర్తిస్తామంటే కుదరదు




హైదరాబాద్,: మహానగరంలో విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్(హైడ్రా)పై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేసింది. ఇష్టానుసారం కూల్చివేతలు చేపడతారా? అంటూ మండిపడింది. ఈ క్రమంలో తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. హైడ్రా కూల్చివేతల వ్యవహారంపై పై దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా జస్టిస్ కే.లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు. "మీ ఇష్టం వచ్చినట్లు కూల్చివేతలు చేపడతారా? సెలవు దినాల్లో కూల్చివేతలు చట్టవిరుద్ధమని చెప్పినా నిబంధనలు పాటించరా? న్యాయస్థానం ఆదేశాలంటే లెక్కలేకుండా వ్యవహరిస్తే.. అది తెలిసేలా చేస్తాం అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. గత విచారణ సందర్భంగా ఇచ్చిన ఆదేశాలతో హై కోర్టుకు హాజరైన హైడ్రా ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్ పైనా ధర్మాసనం మండిపడింది. పోలీస్ శాఖను నుంచి డిప్యూటేషన్‌పై వచ్చినంత మాత్రాన అక్కడ వ్యవహరించినట్లు ఇక్కడ ఉంటామంటే కుదరదు అని మందలించారు. మరోసారి ఇలాగే జరిగితే మీపై చర్యలకు డీజీపీకి ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆక్రమణల స్వాధీనానికి, అక్రమ భవనాల కూల్చివేతకు మేం వ్యతిరేకం కాదన్న జస్టిస్ కే లక్ష్మణ్.. ఏది చేసిన చట్టపరంగా ఉండాలని సూచించారు. అలాగని ఇష్టం వచ్చినట్లు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం విచారణను వాయిదా వేశారు.

# ప్రజానుకూల పద్దు కావాలి...




'షెడ్డులో సగం.. గుడిలో సగం' ఆదిలాబాద్ జిల్లా దుబ్బగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితిని వివరిస్తూ పత్రికల్లో తాజాగా వచ్చిన కథనానికి శీర్షిక ఇది. 'ప్రసవానికి డోలీలోనే' భద్రాచలం మారుమూల అటవీ ప్రాంతంలో గర్భిణీలు, బాలింతల పరిస్థితిపై వచ్చిన మరో కథనమిది. అత్యంత కీలకమైన విద్యా, వైద్య రంగాలపై పాలకుల నిర్లక్ష్యానికి ఇవి ప్రబల తార్కాణాలు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకూ ప్రభుత్వాలు ఈ రెండు రంగాలకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్నా వాటి విడుదల, తద్వారా పథకాల అమల్లో మాత్రం చిత్తశుద్ధిని ప్రదర్శించలేకపోతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాకపోవటం శోచనీయం. గత బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు సైతం 'చేసింది గోరంత–చెప్పుకునేది కొండంత' అనే విధంగానే వ్యవహరిస్తున్నాయి తప్పితే ఆచరణలో చిత్తశుద్ధిని ప్రదర్శించటం లేదు. గత దశాబ్ద కాలంగా వైద్య విద్య, ఫుడ్ సేఫ్టీ, మాదక ద్రవ్యాల విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయంటూ ఇటీవల నిర్వహించిన బడ్జెట్ ప్రతిపాదిత సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వాపోయారు.. కానీ గత ఏడాది కాలంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు, ఆయా రంగాలను ఎందుకు ప్రక్షాళన చేయలేదు, వాటికి చాలినన్ని నిధులు ఎందుకు కేటాయించలేదన్నది ప్రశ్నార్థకం. మరోవైపు రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన దళితులు, గిరిజనుల కోసం ఉద్దేశించిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక నిధుల విషయంలోనూ పాలకులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటం ఆందోళనకరం. బీఆర్ఎస్ హయాంలో సంబంధింత నిధుల వ్యయం ఎప్పుడూ 70 శాతాన్ని దాటలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మిగతా ముప్పై శాతం నిధులను కేసీఆర్ సర్కారు ఇతర పనులకు వినియోగించిందన్న విమర్శలకు అప్పటి ప్రభుత్వం ఇప్పటిదాకా జవాబివ్వకపోవటం గమనార్హం. 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు సైతం అదే బాటలో నడిచి, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసింది. 2023-24లో ప్రతిపాదించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పేర్కొన్న నిధుల్లో 77శాతాన్ని ఖర్చు చేసి, మిగతా 23 శాతాన్ని వదిలేసింది. 2024-25 బడ్జెట్‌లో ఇప్పటి వరకూ 48 శాతం నిధులను ఖర్చు చేశారు. అయితే ప్రస్తుత పద్దుకు మార్చి ఆఖరు వరకూ గడువుంది కాబట్టి, అప్పటి వరకూ ఎంత వ్యయం చేశారనే లెక్కలు తేలాల్సి ఉంది. పరిస్థితి ఈ విధంగా ఉండగా మరికొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి తన బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతోంది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రాధాన్యతల గురించి సర్కారు ఆలోచించి, తదనుగుణంగా ముందుకెళ్లాలి. రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకూ విద్యారంగంలో అన్ని స్థాయిల్లోనూ సమూల మార్పులు తెస్తా మంటున్న రేవంత్ సర్కారు అందుకోసం అవసరమైన నిధులను కేటాయించాలి. తెలంగాణలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలంటూ సీపీఐ(ఎం) ఇటీవల విజ్ఞప్తి చేసిన సంగతి విదితమే. ఆ కోవలోనే ఇతర రంగాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన బడ్జెట్‌ను ప్రతిపాదించాలి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు వీలుగా బడ్జెట్ కూర్పు ఉండాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వాటిని చెల్లించేందుకు తిప్పల గురించి ఇప్పటిదాకా చెబుతూ వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇక ఇప్పుడు తప్పించుకోవటానికి వీల్లేదు. అధికారంలోకి వచ్చిన కొత్తలో 'ప్రభుత్వ ఉద్యోగులం దరికీ ఒకటో తారీఖునే జీతాలు' అంటూ ముఖ్యమంత్రి, మంత్రులు ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. ప్రభుత్వఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, సిబ్బందికి రావాల్సిన గ్రాట్యూటీ, ఇతర బెనిఫిట్లు, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు చెల్లించాల్సిన ఈఎల్స్ డబ్బులు తదితరాలు రూ.వందల కోట్ల మేర పేరుకు పోవటంతో ఆర్థికశాఖ ఉన్నతాధికారులకు ఏం చేయాలో తెలియని దుస్థితి. వాటి కోసం నెలలు, ఏండ్లు ఎదురు చూసిన బాధితులు సహనం కోల్పోతున్న పరిస్థితి. ఇలాంటి సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారం బడ్జెట్. అది ప్రజానుకూలంగా ఉంటే ప్రభుత్వం సేఫ్. లేదంటే మళ్లీ ధర్నాచౌక్ దద్దరిల్లటం ఖాయం.

# గ్లోబల్ వాణిజ్యానికి చావుదెబ్బ



అమెరికా ఎగుమతులపై ఇతర దేశాలు విధించే దిగుమతి సుంకాలకు సమాన స్థాయిలో విధించేందుకు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థపై మరోసారి గట్టి దాడి చేస్తోంది. ఇది న్యాయమైన చర్యగా ప్రచారం జరుగుతున్నప్పటికీ సరఫరా గొలుసులను భ్రష్టు పట్టించి వాణిజ్య యుద్ధాలను ప్రోత్సాహిస్తుంది. ప్రత్యేకంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారం కలిగించే ప్రమాదం దీనిలో ఉంది. సంరక్షణ వాణిజ్య విధానాలు ట్రంప్ ఆర్థిక మోడల్‌కు ప్రాథమిక లక్షణంగా ఉండగా, పరస్పర టారిఫ్‌ల రూపంలో తీసుకున్న ఈ నిర్ణయం అమెరికా ఆర్థిక జాతీయవాద వైఖరిని మరింతగా వ్యక్తపరుస్తోంది. దీని ప్రభావం వల్ల గ్లోబల్ వాణిజ్య సహకారాన్ని దెబ్బతీసి, అంతర్జాతీయ వాణిజ్యంలో కల్లోలం రేపనుంది. పరస్పర టారిఫ్‌లు అంటే ఒక దేశం అమెరికా ఉత్పత్తులపై ఎంత శాతం సుంకాన్ని విధిస్తే, అమెరికా కూడా ఆ దేశపు ఉత్పత్తులపై అదే స్థాయిలో టారిఫ్‌లను విధిస్తుంది. ఈ విధానం వాణిజ్యంలో సమానత్వాన్ని తీసుకురావాలని భావిస్తున్నప్పటికీ అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ దీని కంటే ఎంతో క్లిష్టమైనది. దేశాల టారిఫ్ నిర్మాణాలు చరిత్ర, ఆర్థిక పరిస్థితులు, వ్యూహాత్మక ప్రయోజనాల ఆధారంగా రూపొందించబడతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ పరిశ్రమలను రక్షించుకోవడానికి అధిక టారిఫ్‌లను అమలు చేస్తాయి. అలా కాకుండా సమాన టారిఫ్ విధానం తప్పనిసరి చేస్తే ఈ దేశాల అభివృద్ధికి అంతరాయం కలిగించే ప్రమాదం ఉంది. ఈ టారిఫ్‌లు ఎలా లెక్కించబడతాయనేది మరొక ముఖ్యమైన అంశం. అమెరికా వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం ఇతర దేశాలు అమెరికా ఉత్పత్తులపై విధించే సగటు సుంకాలను విశ్లేషించి, ఆ మేరకు అమెరికా టారిఫ్‌లను నిర్ణయించవచ్చు. అయితే, వాణిజ్యంలో కొన్ని రంగాలు అధిక పరిరక్షణకు గురవుతాయి. మరికొన్ని రంగాలు తక్కువ సుంకాలతో పనిచేస్తాయి. అందువల్ల పరస్పర టారిఫ్ విధానం మార్కెట్‌ను అస్థిరపరచవచ్చు. ఉదాహరణకు, భారత వ్యవసాయ రంగం అధిక దిగుమతి సుంకాలతో వ్యవసాయదారులను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు ప్రభుత్వ రాయితీలతో ఉత్పత్తి చేయబడి తక్కువ ధరలకు లభిస్తాయి. అటువంటి పరిస్థితిలో పరస్పర టారిఫ్‌లు అమలు చేయడం భారతీయ రైతాంగాన్ని తీవ్రమైన ఇబ్బందులకు గురిచేయవచ్చు. మరోవైపు, అమెరికా టెక్నాలజీ, ఔషధ రంగాలకు ఎక్కువ సుంకాలు లేవు కాబట్టి, పరస్పర విధానం మితిమీరిన ప్రతిస్పందనగా మారే అవకాశం ఉంది. ట్రంప్‌కు పరస్పర టారిఫ్‌లు ఎందుకు అవసరమయ్యాయి? ఆయన ఎప్పటినుంచో వాణిజ్య లోటును అన్యాయ విధానంగా అభివర్ణిస్తూ వస్తున్నారు. చైనా, భారతదేశం లాంటి దేశాలు అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలను విధిస్తుండగా, అమెరికా తమ మార్కెట్లను వీరికి అందుబాటులో ఉంచుతోందని అతని వాదన. కానీ వాణిజ్య లోటు అనేది తప్పనిసరిగా చెడు సూచిక కాదని ప్రపంచ ఆర్థికవేత్తలు ఎప్పటినుంచో చెబుతున్నారు. ఇది వినియోగదారుల ఎంపికలు, ఉత్పత్తి సామర్థ్యం, కరెన్సీ మార్పిడి రేట్లు, పెట్టుబడి ప్రవాహాలు వంటి అంశాలను ప్రతిబింబించే అంశం. అమెరికా అనేక దశాబ్దాలుగా వాణిజ్యలోటుతో ఉన్నప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత బలమైన దేశంగా కొనసాగుతోంది. కానీ ట్రంప్, వాణిజ్య లోటును ప్రమాదంగా చిత్రీకరించి, తక్కువ ధరలకు దిగుమతులను అందిపుచ్చుకునే అమెరికా వినియోగదారుల ప్రయోజనాలను పూర్తిగా మరిచిపోతున్నాడు. పరస్పర టారిఫ్‌ల ప్రభావం భారతదేశంపై తీవ్రమైనదిగా ఉండే అవకాశం ఉంది. వాణిజ్యపరంగా భారతదేశం కొన్ని రంగాల్లో ముఖ్యంగా వస్త్ర, వాహన, వ్యవసాయ రంగాల్లో అధిక టారిఫ్‌లను అమలు చేస్తుంది. అమెరికా ఈ రంగాలపై ప్రతిస్పందనగా అధిక సుంకాలను విధిస్తే, భారతీయ ఉత్పత్తుల అమెరికా ఎగుమతులు తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే ట్రంప్ విధించిన ఉక్కు, అల్యూమినియం టారిఫ్‌లు భారతీయ కంపెనీలపై ప్రభావం చూపాయి. ఇక మరోసారి పరస్పర టారిఫ్‌లు అమలైతే, భారతీయ ఔషధ, ఐటి రంగాలు కూడా దెబ్బతినే అవకాశముంది. అమెరికాలో భారతీయ ఉత్పత్తుల ఖర్చు పెరిగితే, ఎగుమతులు తగ్గి వేలాది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, వాణిజ్య సంబంధాలు బలహీనపడితే, భారతదేశం కొత్త మార్కెట్ల కోసం వెతకాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. గ్లోబల్ వాణిజ్య వ్యవస్థను చూస్తే ట్రంప్ తీసుకున్న నిర్ణయం మరింత సంక్షోభాన్ని తీసుకురావచ్చు. ప్రపంచ వాణిజ్య సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) వాణిజ్య వివాదాలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన వ్యవస్థ. కానీ, ట్రంప్ విధానం మిగతా దేశాలను కూడా పరస్పర టారిఫ్‌ల వైపు నడిపిస్తే, అంతర్జాతీయ మార్కెట్లలో అస్థిరత పెరుగుతుంది. చైనా, యూరోపియన్ యూనియన్ లాంటి దేశాలు ఇప్పటికే ట్రంప్ వాణిజ్య విధానాలకు ప్రతిస్పందించిన అనుభవం ఉంది. ఈసారి కూడా అదే జరిగితే, వాణిజ్య యుద్ధం మరింత ముదిరే అవకాశం ఉంది. దీని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైనదిగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిణామం అమెరికా గ్లోబల్ వాణిజ్య నాయకత్వాన్ని నెమ్మదిగా కోల్పోయేలా చేస్తోంది. పరస్పర టారిఫ్‌లు అమెరికా వాణిజ్యాన్ని సరళతరం చేస్తాయని ట్రంప్ భావించినప్పటికీ దీని వల్ల ఏర్పడే అంతర్జాతీయ ప్రభావాన్ని పూర్తిగా విస్మరించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇది తీవ్రమైన ఆర్థిక దెబ్బతీసే ప్రమాదం ఉంది. భారత్ లాంటి దేశాలకు, ఈ సంరక్షణ వాణిజ్య విధానాల నడుమ, అమెరికాతో వాణిజ్య సంబంధాలను నిర్వహించడం సవాలుగా మారనుంది. అమెరికా ఇలాంటి రక్షణాత్మక విధానాలను కొనసాగిస్తే దీని ప్రభావం గ్లోబల్ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయగలదు, చివరికి ఎవరూ దీని నుంచి లాభపడే అవకాశం ఉండదు.

# మరో మహమ్మారి వ్యాధి... తస్మాత్ జాగ్రత్త




గులియన్ బారీ సిండ్రోమ్ (జిబిఎస్) లక్షమందిలో ఒకరిద్దరికి మాత్రమే సోకే ఒక వ్యాధి పేరు ఇది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార?ండ్, హర్యానాతోపాటు, దక్షిణాది రాష్ట్రాలను ఈ మహమ్మారి వణికిస్తోంది. పాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తోంది. అంటువ్యాధి కానప్పటికీ, అరుదుగా సోకే వ్యాధే అయినప్పటికీ ఇది సోకితే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉండటంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై, వ్యాధి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయి. కలుషితమైన నీరు, ఆహారం కారణంగా సోకే జిబిఎస్ సాధారణంగా పెద్దవారిపై మాత్రమే ప్రభావం చూపిస్తుంది. అయితే ఇటీవల బయటపడిన కొన్ని కేసులలో పిల్లలకూ ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ కావడమే ఇప్పుడు కలవరం కలిగించే అంశం. ఢిల్లీలో వంద కేసులు వెలుగు చూడగా, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటికే 60 మంది ఈ వ్యాధి బారినపడ్డారు. ఒకే రోజు 11 కేసులు వెలుగు చూడటం వెన్నులో వణుకు పుట్టిస్తోంది. యాభై మంది జిబిఎస్ బారినపడ్డారనీ, వీరిలో ఇద్దరు మృతి చెందారని స్వయంగా ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్యమంత్రి ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తాజాగా తెలంగాణలోనూ జిబిఎస్ కాలు మోపినట్లు నిర్ధారణ అయింది. సిద్దిపేట జిల్లాకు చెందిన ఒక మహిళ జిబిఎస్ బారినపడి కన్నుమూయడంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఉదర సంబంధిత వ్యాధులకు కారణమయ్యే కాంపైలోబాక్టర్ జెజునీ అనే బ్యాక్టీరియాయే గులియన్ బారీ సింద్రో మ్‌కూ కారణమవుతోంది. వైద్య పరిభాషలో ఇది ఒక ఆటో ఇమ్యూన్ వ్యాధి. కలుషిత నీరు, ఆహారంతో ఉదరంలోకి వ్యాధికారక బ్యాక్టీరియా ప్రవేశించి, తన ప్రతాపాన్ని చూపిస్తుంది. విరేచనాలు, కడుపు నొప్పి, నీరసంతో మొదలై, రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీయడం ఈ వ్యాధి ప్రత్యేకత. శరీరంలో ఉండే యాంటీబాడీలు సొంత కణజాలాలపైనే దాడి చేసి, నిర్వీర్యం చేస్తాయి. ఫలితంగా నాడీ వ్యవస్థ పనిచేయక, కండరాలు చచ్చుబడతాయి. సకాలంలో గుర్తించి చికిత్స పొందితే బతికి బయటపడే అవకాశం ఉన్నా, ఆలస్యం జరిగితే రోగిని వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ ఫెక్షన్ల కారణంగా రోగనిరోధక శక్తి క్షీణించినవారికి జిబిఎస్ త్వరగా సోకుతుందన్న వైద్యుల హెచ్చరికలు నిర్లక్ష్యం చేయడానికి వీలులేదు. గులియన్ బారీ సింద్రోమ్ ప్రబలడానికి కుంభమేళా కూడా ఒక కారణం కావచ్చునని ఆయా రాష్ట్రప్రభుత్వాలు అనుమానిస్తున్నాయి. కోట్లాది మంది భక్తులు తరలివచ్చి స్నానాలు ఆచరిస్తూ ఉండటంతో నదీ జలాలు కలుషితమై జిబిఎస్ సోకుతోందన్న వైద్యనిపుణుల మాటలను కొట్టిపారేయలేం. మహారాష్ట్ర సరిహద్దుల్లో కర్ణాటకకు చెందిన రెండు గ్రామాల ప్రజలు ఈ వ్యాధికి గురికావడంతో ఆరా తీయగా ఇటీవల తీర్థయాత్రలకు వెళ్లివచ్చిన కొందరు గ్రామస్థులు జిబిఎస్ బారిన పడినట్లు తేలింది. కాబట్టి ప్రయాగ్‌రాజ్ సహా, గంగానదీ తీర ప్రాంతాల్లో జలశుద్ధికి చర్యలు తీసుకోవడం తక్షణావసరం. పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు గులియన్ బారీ సింద్రోమ్ వ్యాధి గురించి, వ్యాధి లక్షణాల గురించి అవగాహన కలిగించడం మరీ ముఖ్యం. లేనిపక్షంలో విరేచనాలు, నీరసమే కదాని సొంత వైద్యం చేసుకుని ప్రాణాల మీదకు తెచ్చుకునే ప్రమాదం ఉంటుంది. తీర్థయాత్రలకు వెళ్లి స్వస్థలాలకు చేరుకున్నవారు తమలో ఈ వ్యాధి లక్షణాలు గమనిస్తే, తక్షణమే వైద్యులను సంప్రదించడం మేలు. జిబిఎస్‌కు చికిత్స ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడం గమనార్హం. ఈ వ్యాధికి వినియోగించే ఇమ్యునో గ్లోబ్యులిన్ ఇంజెక్షన్ల ఖరీదు 30 వేల రూపాయల పైమాటే. పైగా ఈ ఇంజెక్షన్లను రోజుకు మూడు చొప్పున ఇవ్వవలసి ఉంటుంది. పేద ప్రజానీకం ఇంతటి ఖర్చును భరించే పరిస్థితి ఉండదు కాబట్టి ప్రభుత్వాలు ముందుకు వచ్చి, ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు, ఇంజెక్షన్లు నిల్వ ఉండేలా చూడాలి. మొక్కై వంగనిది మానై వంగదంటారు. ఇప్పుడిప్పుడే దేశమంతటా వ్యాపిస్తూ, తన ప్రతాపాన్ని చూపిస్తున్న ఈ మహమ్మారి వ్యాధి కోరలు పెరికివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కతాటిపైకి వచ్చి, యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోకపోతే, కరోనా మాదిరిగా ఇది కూడా ప్రజల ప్రాణాలను పెద్ద సంఖ్యలో కబళించే ప్రమాదం ఉంటుంది. తస్మాత్ జాగ్రత్త!

## పనామా చేరుకున్న భారతీయుల బృందం



పనామా సిటీ : అమెరికా వెనక్కి పంపిన భారతీయుల బృందం తమ దేశం చేరుకున్నట్లు పనామా భారత్‌కు తెలిపింది. అమెరికా నుండి భారతీయుల బృందం పనామా చేరుకున్నట్లు అక్కడి అధికారులు తమకు తెలియజేశారని పనామా, కోస్టారికా మరియు నికరాగ్వాలోని భారత రాయబార కార్యాలయం గురువారం సోషల్‌మీడియా ఎక్స్‌లో పేర్కొంది. వారు సురక్షితంగా ఉన్నారని, అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపింది. వారిని తిరిగి భారత్‌కు పంపేందుకు ఆతిథ్య దేశంతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొంది. అయితే ఆ బృందంలో ఎంతమంది భారతీయులున్నారనే సమాచారాన్ని అందించలేదు. ఇటీవల అమెరికా పనామాకు పంపిన 299 మంది అతిపెద్ద వలసదారుల బృందంలో భారతీయులు కూడా ఉన్నట్లు సమాచారం. అమెరికాలో బహిష్కరణకు గురైన వారికి తమ దేశం వారధిగా మారుతుందని పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో ప్రకటించిన అనంతరం గతవారం అమెరికా వారిని మూడు విమానాలలో పనామాకు పంపిన సంగతి తెలిసిందే. 299 మంది వలసదారులలో కేవలం 171 మంది మాత్రమే తమ స్వదేశాలకు వెళ్లేందుకు అంగీకరించినట్లు పనామా అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరాకరించిన 98 మందిని పనామాలో డారియన్ ప్రావిన్స్‌లోని శిబిరానికి పంపినట్లు తెలిపారు. ట్రంప్ అమెరిక అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారుల పేరుతో ఇప్పటికే 332 మంది భారతీయులను మూడు బ్యాచ్‌లుగా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే.

## నీటి కాలుష్యం వార్తల్ని కొట్టిపారేస్తున్న యోగి



లక్నో : ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో గంగా నది నీరు స్నానానికి పనికిరావని, ఆ నీటిలో మల సంబంధమైన బ్యాక్టీరియా (ఫేకల్ కోలీఫాం బ్యాక్టీరియా) తీవ్రస్థాయిలో ఉందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు తాజాగా ఇచ్చిన నివేదికలో తెలిపింది. అయితే ఈ నివేదికపై యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలో తీవ్రంగా స్పందించారు. ఆ నీరు స్నానం చేయడానికే కాదు.. తాగడానికి కూడా ఉపయోగించొచ్చు అని వ్యాఖ్యానించారు. అయితే యోగి వ్యాఖ్యలపై ఎస్‌పి పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ స్పందించారు. సంగమం నీటిలో మలసంబంధమైన బ్యాక్టీరియా ఉందని వస్తున్న వార్తలను దాచిపెట్టేందుకు యోగి ప్రయత్నిస్తున్నారని అఖిలేష్ ఆరోపించారు. ఆ వార్తలను వ్యాప్తి చేయకుండా మీడియాను యోగి ప్రభుత్వం నియంత్రిస్తోందని అఖిలేష్ ఆరోపించారు. ఈమేరకు ఆయన గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. వాస్తవానికి కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఎన్‌జిటికి అందించిన నివేదిక గత నెల జనవరి 12-13 తేదీలలో నీటి ప్రమాణాలను పరీక్షించినది. ఆరోజుల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్‌కి సంబంధించి నదుల నీటి నాణ్యత గురించి సిపిసిబి ఎన్‌జిటికి నివేదిక అందించింది. అప్పుడు నీటిని పరీక్షించినప్పుడు ఆ నీరు స్నానం చేసేందుకు పనికిరాదని.. కొన్ని ప్రదేశాల్లో బ్యాక్టీరియా తీవ్రస్థాయిలో ఉందని తెలిపింది. అయితే సిపిసిబి ఇచ్చిన నివేదికను సిఎం యోగి ఆదిత్యనాథ్ తేలికగా కొట్టిపారేశారు. అది అవాస్తవమని కామెంట్ చేశారు. దీన్నిబట్టి చూస్తే.. ప్రతిదీ సిఎం నియంత్రణలో ఉండాలనే విధంగానే ఉంది. నీటి కాలుష్యంపై వస్తున్న వార్తల్ని వ్యాప్తి చేయకుండా యోగి ప్రభుత్వం నియంత్రిస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సిపిసిబి బోర్డు కానీ కోర్టు వ్యాఖ్యలపై తప్పు అని అవాస్తవ ఆరోపణలు చేసిన యోగిపై కేసు పెట్టవచ్చా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు' అని అఖిలేష్ యాదవ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## నకిలీ ట్రావెల్ ఏజెంట్లపై హర్యానా ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి



న్యూఢిల్లీ : నకిలీ ట్రావెల్ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపాలని కాంగ్రెస్ నేత, సిర్సా ఎంపి కుమారి సెల్జా హర్యానా ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల అమెరికా అక్రమవలసదారులంటూ తిరిగి పంపిన వారిలో పెద్ద సంఖ్యలో హర్యానా యువత ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. విదేశాల్లో ఉద్యోగావకాశాలు, అధిక సంపాదన పేరుతో యువతను ఆకర్షిస్తున్న నకిలీ ట్రావెల్ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని తమ పార్టీ చాలా కాలంగా డిమాండ్ చేస్తోందని గురువారం ఓ పత్రికా ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. ఎంతమంది యువకులు వివిధ దేశాలకు అక్రమంగా వెళ్లారనే అంశంపై మొదట విచారణ చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అనంతరం వారిని గౌరవంగా స్వదేశానికి తీసుకురావడంతో పాటు పునరావాసం కల్పించే బాధ్యత తీసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విదేశాలకు వెళ్లే యువతకు సహాయం అందించడంతో పాటు వారికి సరైన మార్గనిర్దేశం చేస్తుందంటూ 2019లో హర్యానా ప్రభుత్వం విదేశీ సహకార విభాగాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. కానీ ఇప్పటికీ రాష్ట్ర ప్రజలు నకిలీ ట్రావెల్ ఏజెంట్ల బారిన పడుతున్నారని దుయ్యబట్టారు. బిజెపి ప్రభుత్వం ప్రజల భద్రతకు కట్టుబడి ఉంటే యువత నకిలీ ఏజెంట్ల బారిన పడకుండా నిరోధించి, విదేశాల్లో వారికి భద్రత కల్పించి ఉండేదని అన్నారు.

## ప్రారంభమైన లోకో పైలట్ల 36 గంటల సమ్మె




ఢిల్లీ: రైల్వే మంత్రిత్వ శాఖ తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ దేశంలోని లోకో పైలట్లు ప్రకటించిన 36 గంటల నిరాహార దీక్ష ఈరోజు ప్రారంభమైంది. గురువారం ఉదయం 7 గంటల నుండి శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకు సమ్మె జరుగుతుంది. ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సమ్మెకు పిలుపునిచ్చింది. ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లలో డ్యూటీ సమయాన్ని ఆరు గంటలకు తగ్గించడం, సరకు రవాణా రైళ్లలో ఎనిమిది గంటలకు తగ్గించడం, వారానికి 30 గంటల విశ్రాంతి ఇవ్వడం, రన్నింగ్ అలవెన్స్ పెంచడం, లోకో పైలట్ల పోస్టులకు నియామకాలు చేయడం మరియు పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించడం వంటి డిమాండ్లపై ఈ సమ్మె జరుగుతోంది.

# దీనావస్థలో యూరప్ దేశాలు



కళ్లముందు ప్రమాదకర సంకేతాలు కనబడుతున్నా అమెరికాను గుడ్డిగా అనుసరిస్తూ పోవటం అలవాటు చేసుకున్న యూరప్‌కి డోనాల్డ్ ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక వరస షాక్‌లు తప్పడం లేదు. గతవారం జర్మనీలో జరిగిన మ్యూనిక్ భద్రతా సదస్సుకొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'వాక్ స్వాతంత్ర్యానికీ, ప్రజాస్వామ్యానికీ మీవల్లే ముప్పు ముంచుకొస్తున్నద'ని యూరప్ దేశాలపై విరుచుకుపడ్డారు. దాన్నుంచి తేరుకోకముందే ఆ దేశాల ప్రమేయం లేకుండా ఉక్రెయిన్ యుద్ధం నిలుపుదలపై రష్యాతో సౌదీ అరేబియాలోని రియాద్‌లో అమెరికా భేటీ అయింది. యూరప్ వరకూ ఎందుకు... రష్యాతో రెండేళ్లుగా సాగుతున్న యుద్ధంలో శిథిలావస్థకు చేరిన ఉక్రె యిన్‌నే ఆ చర్చలకు ఆహ్వానించలేదు. యుద్ధం ఆపడానికి అవకాశాలున్నాయా, ఆ విషయంలో తొలి అడుగువేయటం అసలు సాధ్యమేనా అనే అంశాలను నిర్ధారించుకోవటానికే రియాద్ సమావేశం జరిగిందని అమెరికా విదేశాంగశాఖ సంజాయిషీ ఇస్తున్నా దాని వ్యవహారశైలి యూరప్ దేశా లకు మింగుడు పడటం లేదు. ఆ విషయంలో నిజంగా చిత్తశుద్ధి వుంటే రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడటానికి ముందు ట్రంప్ యూరప్ దేశాల అధినేతలను సంప్రదించేవారు. దాదాపు ఎనభైయేళ్లుగా యూరప్ దేశాలన్నీ అమెరికా అడుగుజాడల్లో నడిచాయి. రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ సైన్యాన్ని మట్టికరిపించిన సోవియెట్ సేనలు తూర్పు యూరప్ దేశాల తర్వాత తమవైపే చొచ్చుకొస్తాయని, తాము బలికావటం ఖాయమని పశ్చిమ యూరప్ దేశాలు వణికిపోయాయి. నాటి అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ దీన్ని చక్కగా వినియోగించుకుని ఉత్తర అమెరికా ఖండంలో తన పొరుగు దేశమైన కెనడాను కలుపుకొని పశ్చిమ యూరప్ దేశాలతో జత కట్టి పటిష్ఠమైన సైనిక కూటమి నాటోకు అంకురార్పణ చేశారు. అమెరికా-సోవియెట్‌ల మధ్య సాగే పోటీలో యూరప్ దేశాలు అవసరం లేకున్నా తలదూర్చాయి. ఆర్థికవ్యవస్థలు అనుమతించక పోయినా తమ తమ జీడీపీల్లో రెండు శాతం నాటో కోసం వ్యయం చేశాయి. యూరప్ భూభాగంలో అణ్వాయుధాల మోహరింపు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, మారణాయుధాలు జోరందుకున్నాయి. యూరప్ దేశాలకు ఆనాటి సోవియెట్ నుంచి లేదా ప్రస్తుత రష్యా నుంచి ఎన్నడూ ముప్పు కలగలేదుగానీ... నాటోవల్ల లిబియా, సిరియా, అఫ్గానిస్తాన్, సూడాన్, సోమాలియా తది తర దేశాలు అస్థిరత్వంలోకి జారుకుని ఉగ్రవాదం వేళ్లూనుకుంది. సిరియావంటి దేశాల్లో ప్రభుత్వా లను కూలదోసేందుకు విచ్చలవిడిగా ఆయుధాలందించటంవల్ల ఐసిస్ అనే భయంకర ఉగ్రవాద సంస్థ ఆవిర్భవించింది. ఉక్రెయిన్ దురాక్రమణకు రష్యాను రెచ్చగొట్టింది కూడా యూరప్ దేశాలే. 2013లో అమెరికా ప్రోద్బలంతో ఉక్రెయిన్‌తో ఆర్థిక ఒప్పందం కుదుర్చుకోవటంతోపాటు ఐఎంఎఫ్ రుణం పొందేందుకు సహకరించింది ఈయూ దేశాల కూటమే. అయితే ఐఎంఎఫ్ కఠిన షరతులను తిరస్కరించి రష్యా ఇచ్చే 1,500 కోట్ల డాలర్ల రుణం తీసుకోవటానికి అప్పటి ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యనుకోవిచ్ నిర్ణయించటంతో దేశంలో ప్రజా ఉద్యమం పేరిట తిరుగుబాటుకు అంకు రార్పణచేసి అస్థిరపరచటంలో అమెరికా, ఈయూల పాత్ర వుంది. ఈ పరిణామాలే పుతిన్‌ను క్రిమియా ఆక్రమణకు పురిగొల్పాయి. ఎన్నికల్లో చట్టబద్ధంగా గెలిచిన యనుకోవిచ్‌ను ఈ వంక చూపి 2019లో కూలదోసి, సినీ నటుడు జెలెన్‌స్కీని అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టడం, పర్యవసానంగా మూడేళ్లక్రితం పుతిన్ ఉక్రెయిన్‌పై దండెత్తటం వర్తమాన చరిత్ర. యుద్ధంపై తమ ప్రమేయం లేని చర్చల్ని గుర్తించబోనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యూరప్ దేశాలకు కనీసం ఆ మాత్రం ధైర్యం కూడా లేదు. తాజా పరిణామాల నేప థ్యంలో ఏం చేయాలో చర్చించటానికి ఫ్రాన్స్ చొరవతో సోమవారం పారిస్‌లో జరిగిన అత్యవసర భేటీకి అరడజను దేశాలు హాజరయ్యాయి. అవి కూడా కింకర్తవ్య విచికిత్సలో పడ్డాయి. ఉక్రెయిన్‌కు శాంతి సేనలను పంపటానికి తాను సిద్ధమని ప్రకటించిన బ్రిటన్... ఆ వెంటనే 'అమెరికా అందుకు అనుమతిస్తేనే' అని ముక్తాయించింది. ఈలోగా జర్మనీ, పోలాండ్, స్పెయిన్‌లు దాన్ని అసందర్భ ప్రతిపాదనగా కొట్టిపారేశాయి. అమెరికా తాజా వైఖరితో యూరప్ స్వీయరక్షణ కోసం సొంతంగా సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న ప్రతిపాదనపై సైతం అనుకూల స్వరాలు వినబడటంలేదు. ట్రంప్ ఆగమనం తర్వాత అమెరికాతో యూరప్ దేశాల సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్న అభిప్రాయం అందరిలో ఏర్పడింది. దీనికితోడు ట్రంప్ అనుచరగణం యూరప్‌లో తీవ్ర మితవాద పక్షాలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం వివిధ దేశాధినేతలకు ఉంది. ట్రంప్ వైఖరి ఎలా వుంటుందన్న అంశంలో ఆయన తొలి ఏలుబడిలో యూరప్ దేశాలకు తగి నంత అవగాహన వచ్చింది. కానీ దశాబ్దాల తరబడి అమెరికా అనుసరిస్తున్న విధానాలను రెండో దఫాలో మెరుపువేగంతో ఆయన తిరగరాస్తారని ఆ దేశాలు ఊహించలేదు. ఈసారి ట్రంప్ వెనకున్న ఎలాన్ మస్క్, స్టీవ్ బానన్, మార్కో రుబియో తదితరులతోపాటు సమర్థుడైన దూతగా పేరున్న విట్‌కాఫ్‌లే అందుకు కారణం కావొచ్చు. పర్యవసానంగా ట్రంప్ రంగప్రవేశం చేసి నెల తిరగకుండానే యూరప్ దేశాలకు ప్రపంచం తలకిందులైన భావన కలిగింది. స్వతంత్రంగా ఎదగటానికి ప్రయత్నించక కీలుబొమ్మల్లా వ్యవహరించిన ఆ దేశాలు ఇప్పటికైనా వివేకం తెచ్చుకోవాలి. సొంత ఆలోచనతో, స్వీయప్రయోజనాల కోసం పనిచేయటం నేర్చుకోవాలి. రోజులు ఎప్పుడూ ఒకేలా వుండవని గ్రహించాలి.

# 'కుంభమేళా' నేరాలు



కుంభమేళా జరుగుతున్న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరిన యాత్రికులు ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి తొక్కిసలాటలో 18 మంది మరణించడం దిగ్భ్రాంతి కలిగించే విషయం. చనిపోయిన వారిలో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉండటం కలిచివేస్తుంది. ఈ దుర్ఘటనలో పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఇంకా కొందరి పరిస్థితి విషమంగానే ఉందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. తొక్కిసలాటపై ప్రభుత్వం ఇద్దరు అధికారులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. విచారణ ప్రారంభించిన సదరు కమిటీ అప్పుడే కేంద్ర ప్రభుత్వం, రైల్వేశాఖ వైఫల్యాలను కప్పెట్టేందుకు నానా తంటాలూ పడుతోంది. ప్లాట్‌ఫారాలకు ఒకే పేరు కలిగిన రైళ్లు వస్తాయని రైల్వేస్టేషన్‌లో చేసిన అనౌన్స్‌మెంట్, అప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లాల్సిన మూడు రైళ్లు ఆలస్యం కావడం, ప్రయాణీకుల అనూహ్య రద్దీ, ఇరుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏవేవో కారణాలను లీకుల రూపంలో వండి వారుస్తోంది. ఉన్నత స్థాయి కమిటీ నివేదిక పూర్తి స్థాయిలో తయారు కాకుండానే నిర్ధారణలకు రావడం బట్టి చివరికి ఏమవుతుందో ఊహించడం పెద్ద కష్టమేం కాదు. గతంలో పలు రైలు ప్రమాదాల విచారణలకు ఏ గతి పట్టించారో ఇదీ అంతేనని అర్థమవుతుంది. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాలు, ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వంలోని పలువురి సంతాపాలు కంటి తుడుపు చర్యలుగానే కనిపిస్తాయి. త్రివేణి సంగమంలో నెల రోజుల పాటు యుపి బిజెపి ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన మహా కుంభమేళాలో, ఆ పేరిట జరిగిన వరుస ప్రమాదాల్లో ఎంత మంది అశువులు బాసారో లెక్కలేదు. గత నెల 29న మౌని అమావాస్య నాడు లక్షలాది మంది ప్రయాగ్‌రాజ్ చేరడంతో పెద్ద ఎత్తున తొక్కిసలాట జరగ్గా 30 మంది చనిపోయారని, 60 మంది వరకు గాయపడ్డారని యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. అంతకు కొన్ని రెట్ల మంది మరణించారని, క్షతగాత్రులయ్యారని ప్రతిపక్షాలు, ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కరోనా సమయంలో గంగానదిలో కొట్టుకొచ్చిన మృతదేహాలను గుర్తుకు తెచ్చుకుంటే ప్రతిపక్షాల విమర్శలను కొట్టిపారేయలేం. ప్రయాగ్‌రాజ్‌లో ఇప్పటి వరకు ఏడు అగ్ని ప్రమాదాలు సంభవించాయన్నది ఒక లెక్క. యావత్ దేశాన్నీ నివ్వెరపాటుకు గురిచేసిన మౌని అమావాస్య రోజు నాటి తొక్కిసలాటకూ ఒక చోట అగ్ని రాజుకోవడమే హేతువని తెలుస్తోంది. ఇంతటి ఘోర ఉదంతాలను అటు మోడీ సర్కారు ఇటు యోగి సర్కారు లైట్ తీసుకుంటున్నాయనడానికి వరుస ఘటనలే నిదర్శనాలు. కుంభమేళాకు కేంద్ర ప్రభుత్వం, యోగి సర్కారు కల్పించిన ప్రచారానికి ఆకాశమే హద్దు. మీడియాలో వందల కోట్ల రూపాయల అడ్వర్టయిజ్‌మెంట్లు ఒక ఎత్తు కాగా, ప్రధాన స్రవంతి మీడియాకు అదే పని పెట్టడం మరో ఎత్తు. కుంభమేళాకు వెళ్లకపోతే మానవ జీవితం దండగన్న స్థాయికి ఫోబియాను ప్రజల్లో కల్పించారు. గోడీ మీడియాతో పాటు సంఘ్‌పరివారం సైతం రెచ్చిపోయింది. కుంభమేళాకు ఏడు వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని యోగి సర్కారు ప్రకటించింది కూడా. 40 కోట్ల మంది వస్తారని అంచనా వేసి అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేశామంది. కాని అవి ఎంత డొల్లగా ఉన్నాయో దుర్ఘటనలు విదితం చేస్తున్నాయి. కుంభమేళాతో రెండు మూడు లక్షల కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఊహించినదానికంటే ఇప్పటికే 50 కోట్ల జనం దాటారంటున్నారు. ఇంత మంది పాల్గొంటారని తెలిసి కూడా తగిన ముందస్తు భద్రతా, రక్షణ చర్యలు చేపట్టకపోవడం మోడీ, యోగి ప్రభుత్వాల దారుణ నిర్లక్ష్యానికి పరాకాష్ట. యాత్రికుల ప్రాణాలంటే లెక్కలేనితనం. వరుస తొక్కిసలాటలు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రమాదకర స్థాయికి చేరిన నీటి, గాలి కాలుష్యం చూస్తుంటే ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి లవలేశమాత్రం కేంద్రం, యుపి ప్రభుత్వం బాధ్యతపడలేదని స్పష్టమవుతుంది. ఇవన్నీ కేంద్రం, యోగి ప్రభుత్వ నేరాలుగా పరిగణించాల్సి ఉంటుంది. పలువురు యాత్రికుల ప్రాణాలను హరించిన, ఆస్పత్రుల పాల్జేసిన కుంభమేళా సంబంధ అన్ని దుర్ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను నిర్ధారించి శిక్షిస్తేనే భవిష్యత్తులో యాత్రికులకు కాస్తంత భరోసా సిద్ధిస్తుంది. ఢిల్లీ తొక్కిసలాటకు బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలన్న డిమాండ్ ధర్మ సమ్మతమే!

# అవినీతి ప్రమాదకరం



అవినీతిని, నల్లధనాన్ని తరిమి కొట్టడమే లక్ష్యంగా మోడీజీ మహత్తర విజయాలు సాధించారని ఒకవైపు కీర్తిస్తుంటే ఈ సూచిక వివరణ భిన్నంగా ఉంది. అసలు అవినీతిపై ఇంతగా సమరం చేస్తున్నాను గనకే తనను ప్రత్యర్థులు వేటాడుతున్నారనీ ఆయన చేసిన భావోద్వేగ ప్రకటనలతో భజనపరులు బాధపడిపోతుంటారు. అవినీతిని అరికడతాం.. పూర్తిగా రూపుమాపుతాం అని మోడీ 2014లో చెప్పినా, ఇప్పుడు మాట్లాడుతున్నా అసలు ఆపింది లేనేలేదు. ఇంతచేస్తే పై స్థాయిలో అవినీతి ప్లేగ్ కన్నా భయంకరంగా వ్యాపిస్తోంది. అది దేశంలోని అన్ని అంగాలకు సోకింది. ఇప్పుడది ప్రభుత్వాన్నే శాసిస్తోంది. అది చెప్పినట్టుగా పాలకులు తలలూపాల్సి వస్తోంది. తమ గురువులకు కావా ల్సిన పనిని అవినీతి భూతం చేయించిపెడుతోంది. తాజాగా ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ విడుదల చేసిన 2024 అవినీతి భావన సూచిక కూడా ఇదే రుజువు చేసింది. అవినీతిలో భారతదేశం 180 దేశాలతో పోలిస్తే 96వ స్థానంలో ఉంది. దేశంలో అవినీతి ర్యాంక్ 1995 సంవ త్సరం నుండి 2024 వరకూ సగటున 78.03గా ఉంది. అది 2024లో గరిష్ట స్థాయికి అంటే 96.00కి చేరింది. 1995లో ఈ ర్యాంక్ 35.00గా ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయుల ప్రభ వెలిగిపోతున్నదనీ, విశ్వగురుగా అవతరించిందనీ సుప్రభాత గీతా లతో మేల్కొంటున్నాం. అవినీతిని ఎందుకు అరి కట్టలేకపోతున్నారంటే సమాధానం ఉండదు. ఒకవేళ తమకు రాజకీయంగా ఇబ్బందులు వచ్చినప్పుడు, అవినీతికి ప్రజలు వ్యతిరేకంగా తిరగబడుతున్న సమయంలో రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు చేసేసి.. తప్పుకుంటారు. పెద్దనోట్ల రద్దు సమయంలో ఇలానే జనాన్ని రోడ్లపై నెట్టేసి అవినీతిపరులకు ఏ రకంగా ద్వారాలు తెరిచింది చూశాం. అవినీతిని అడ్డుకోవడం ప్రస్తుత పాలకులకు ఇష్టం లేదు. మరింత పెంచి పోషిస్తూ రాజకీయ పబ్బానికి వాడుకోవడమే బీజేపీ ప్రభుత్వానికి కావాల్సింది. అవినీతి, కార్పొరేట్లు, మతం ఈ మూడింటితోనే దేశ రాజకీయాలను, ప్రభుత్వాన్ని, రాష్ట్రాలను మోడీ ప్రభుత్వం శాసిస్తోంది. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, అస్మదీయులకు ప్రజాసంపదను దోచి పెట్టడంలో గత ప్రభుత్వాల కంటే బీజేపీ ప్రభుత్వం మించి పోయింది. తమకు మేలు చేసిన వారి అవినీతి కుంభ కోణాలు బయటపడినా వారికి అండగా నిలబడింది. వందలు, వేల కోట్ల రూపాయల కుంభకోణాలు బయట కొచ్చినా విజయమాల్యా, నీరవ్‌మోడీ లాంటి దొంగలను దగ్గరుండి దేశం దాటించింది. బీజేపీ నేతలు ప్రభుత్వ రంగాలను పూర్తిగా అనిల్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి పెద్ద పెద్ద పెట్టుబడిదారులకు దగ్గరుండి దోచిపెడుతున్నారు. అనేక చోట్ల అవినీతి జరిగిందని తేలినా చర్యల్లేవు. అవినీతికి దూరంగా ఉండాలని మోడీ చెబుతారు. కానీ తమ హయాంలో జరుగుతున్న అవినీతి కుంభ కోణాల గురించి మాత్రం పెదవి విప్పరు. ఎన్నికల బాండ్ల రూపంలో కార్పొ రేట్ల నుంచి అత్యధికంగా విరాళాలు పొందింది బీజేపీనే. ఆ విషయంలో మరే పార్టీ దరిదాపుల్లోకి లేదు. ఆ డబ్బు అంతా అవినీతికరమైనదే. ఆ డబ్బుతోనే ప్రతిపక్షపార్టీల ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడం, ప్రభుత్వాలను పడకొట్టడం చేసింది. ఎన్నికల బాండ్లను వ్యతిరేకించిన ఏకైక పార్టీ సీపీఐ(ఎం) మాత్రమే. విరాళాలు అందించిన కార్పొరేట్ సంస్థలకు మోడీ లబ్ధి చేకూర్చారు. రైతుల రుణాలు మాఫీ చేయడానికి చట్టం వర్తించదు. అదే కార్పొరేట్లు నష్టపోతే వారి బ్యాంకు రుణాలను ఒక్క కలం పోటుతో రద్దు చేశారు. విమానాల కుంభకోణం, బొగ్గు, విద్యుత్ అవినీతి ఇలా ఎన్ని బయటపడినా మోడీ పాలనలో అవినీతి సర్వసాధారణం అయింది. అంతర్జాతీయంగా మోడీ ఆప్తుడైన అదానీ అవినీతి భాగోతం అమెరికాలో బయటపడినా ఆయన పరివారం పెదవి మెదపలేదు. పైగా ఆయనపై కేసు లేకుండా చేయడం కోసం అమెరికా అధ్యక్షుడిని ప్రభావితం చేసి ఆ దేశంలోని విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం అమ లును నిలిపివేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ట్రంప్ కూడా పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో అదానీ అవినీతిపై మాట్లాడేందుకు నిరాకరించారు. ప్రత్యర్థుల మీద ఏ చిన్న ఆరోపణలు వచ్చినా ఈడీ, సీబీఐ వంటి ప్రభుత్వ సంస్థలను ప్రయోగించి మోడీ ప్రభుత్వం ఇబ్బందులు పాలు చేస్తోంది చూస్తూనే ఉన్నాం. అవినీతి విషయంలో సీరియస్‌గా లేకుంటే, దేశాభివృద్ధిని దెబ్బతీయడమే కాకుండా ప్రజాస్వామ్య విలువల క్షీణత, అస్థిరత, మానవ హక్కుల ఉల్లంఘనలకు కారణమవుతోందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. స్వచ్ఛమైన పాలన, అవినీతి రహితమైన పాలన అని గొప్పలు చెప్పుకోవడం తప్ప పేరుకు పోయిన అవినీతిని అరికట్టకపోగా కార్పొరేట్ల అనుబంధంతో మరింత అవినీతికి ఆస్కారం ఇస్తున్న ప్రభుత్వంగా మనముందు నిలబడింది. పెరుగుతున్న అవినీతి దేశాభివృద్ధికి ఆటంకంగా మారింది.